నవతెలంగాణ

1

మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట

ఆదివారం 02 జులై 2023



విద్యుత్ సిబ్బందిపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలి

నవతెలంగాణ-సిద్దిపేట

గజ్వేల్ మండలంలో క్యాసారం గ్రామంలో కరెంట్ బిల్లు వసూలు కోసం వెళ్ళిన విద్యుత్ సిబ్బంది, జే ఎల్ఎం నరేష్‌పై హత్యాప్రయత్నం చేసిన వారిని కఠినంగా శిక్షించాలని యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ (సీఐటీయూ) యూనియన్ సిద్దిపేట జిల్లా అధ్యక్ష కార్యదర్శిలు అశోక్, చంద్రారెడ్డిలు డిమాండ్ చేశారు. నిరంతరం ప్రజలకు అందు బాటులో ఉంటూ, విద్యుత్‌ను అందిస్తున్న విద్యుత్ సిబ్బందిపై దాడి చేయడం హేయనీయమన్నారు. దాడి చేసిన వారిని శిక్షించాలని కోరారు.

గజ్వేల్ : విద్యుత్ సిబ్బంది నరేష్ పై హత్యా ప్రయత్నం చేసిన వారిని కఠినంగా శిక్షించా లని యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ గజ్వేల్ డివిజన్ అధ్యక్ష కార్య దర్శులు సుధాకర్, పర్శరాములు కోరారు. ఈ ఘటనను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గజ్వేల్ డివిజన్ కోశాధికారి యాదగిరి, జిల్లా నాయకుడు సుధాకర్, గజ్వేల్ డివిజన్ నాయకులు బండ్ల శ్రీనివాస్ మహేష్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామదేవతల ప్రతిష్టానోత్సంలో పాల్గొన్న ఎంపీ

నవతెలంగాణ-దుబ్బాకరూరల్



మండల పరిధిలోని అచ్చుమాయపల్లిలో శనివారం గ్రామదేవతల ప్రతిష్టనను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డి హాజరై అమ్మవారినీ దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా అమ్మవారు కృప కటాక్షంతో ప్రజలందరూ సంతోషంగా ఉండాలని ఆకాంక్షించారు. అనంతరం ఎంపీకి సర్పంచ్, ఉపసర్పంచ్, గ్రామస్తులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ కడతాల రవీందర్ రెడ్డి, పీఏసీఎస్ చైర్మెన్ షేర్ల కైలాస్ , ఎంపీటీసీ రామ్ రెడ్డి, ఏఎంసి చైర్మెన్ జ్యోతి కృష్ణ , రాష్ట్ర సీనియర్ నాయకులు బక్కి వెంకటయ్య గారు రొట్టె రాజమౌళి , జిల్లా ఉపాధ్యక్షులు గుండెల్లిఎల్లారెడ్డి ,మండల పార్టీ అధ్యక్షులు బాణాల శ్రీనివాస్, సర్పంచ్ స్వప్న స్వామి, వార్డు సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ముగిసిన గ్రూప్-4 పరీక్ష

- మొదటి పేపర్‌కు సంగారెడ్డిలో 27,962, సిద్దిపేటలో 21,838 మంది..
- రెండో పేపర్‌కు సంగారెడ్డిలో 27,826, సిద్దిపేటలో 21,744 మంది హాజరు
- బెజ్జంకిలో పరీక్ష రాయలేకపోయిన ఇద్దరు మహిళా అభ్యర్థులు
- గుర్తింపుకార్డు లేక ఒకరు.. ఆలస్యమై మరొకరు

నవతెలంగాణ-సంగారెడ్డి, సిద్దిపేట, బెజ్జంకి





తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎస్పీఎస్సీ) ద్వారా శనివారం జరిగిన గ్రూప్-4 పరీక్ష విజయవంతంగా ముగిసింది. సిద్దిపేట జిల్లా బెజ్జంకి మండలంలో ఇద్దరు మహిళా అభ్యర్థులు పరీక్ష రాయలేకపోయారు. గుర్తింపు కార్డు లేక ఒకరు.. ఆలస్యం కావడంతో మరొకరు నిరాశగా సెంటర్ నుంచి వెనుదిరుగాల్సి వచ్చింది. ఈ ఘటన మినహా ఎలాంటి అవాంఛిత సంఘటనలు జరగకుండా పరీక్ష ముగిసింది. సంగారెడ్డి కలెక్టర్ డాక్టర్ శరత్, సిద్దిపేట జిల్లా కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్‌లు పరీక్షా కేంద్రాలను క్షేత్రస్థాయిలో పర్యటించి పరిశీలించారు.

సంగారెడ్డి జిల్లాలో 33,452 మంది అభ్యర్థులు హాజరు కావాల్సి ఉండగా.. పేపర్-1కు 27,962 మంది హాజరయ్యారని, 5,490 మంది గైర్హాజరైనట్టు కలెక్టర్ తెలిపారు. 83.59 శాతం హాజరయ్యారన్నారు. పేపర్-2కు 27,826 మంది హాజరు కాగా, 5626 మంది గైరాజరయ్యారని, హాజరుశాతం 83.18 శాతంగా నమోదైనందన్నారు. కాగా ఉదయం సెషన్‌లో సంగారెడ్డి పట్టణం బైపాస్ రోడ్‌లో గల రిషి హై స్కూల్ పరీక్షా కేంద్రాన్ని కలెక్టర్ తనిఖీ చేశారు. పరీక్ష నిర్వహణ తీరు తెను ్నలను పరిశీలించారు. పరీక్షా కేంద్రం లోని గదులను సందర్శిస్తూ, అభ్యర్థులకు అందుబాటులో ఉంచిన సదుపాయాలను గమనించారు. స్కిబ్స్ ఉన్నారా అంటూ ఆరా తీశారు. కలెక్టర్ వెంట తహసిల్దార్ విజయ్ కుమార్ ఉన్నారు.

సిద్దిపేట జిల్లా వ్యాప్తంగా 80 పరీక్ష కేంద్రాల్లో 25978 మంది అభ్యర్థులను పరీక్ష రాసేందుకు కేటాయించగా.. పేపర్-1లో 84.06 శాతంతో 21,838 మంది అభ్యర్థులు హాజరయ్యారని కలెక్టర్ తెలిపారు. పేపర్-2లో 83.70 శాతంతో 21744 మంది అభ్యర్థులు హాజరయ్యారన్నారు. కాగా జిల్లా కేంద్రంలోని సెంటర్‌లను జిల్లా కలెక్టర్, జిల్లాలోని ఇతర ప్రాంతాల్లో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) శ్రీనివాస్ రెడ్డి క్షేత్రస్థాయిలో పరిశీలించారు.

గుర్తింపు కార్డు లేక ఒకరు.. ఆలస్యమై మరొకరు



బెజ్జంకి మండంలోని ఆదర్శ విద్యాలయ కేంద్రంలో గ్రూప్-4 పరీక్షలకు హజరయ్యేందుకు హైదరాబాద్ నుంచి వచ్చిన ఇద్దరు మహిళా అభ్యర్థులు నిరాశగా వెనుదిరిగారు. ప్రభుత్వ గుర్తింపు కార్డు లేక ఒకరు.. ఆలస్యమై మరొకరు పరీక్ష రాయలేకపోయారు. ఈ ఇద్దరిలో ఓ మహిళా అభ్యర్థి ఎంతో కాలంగా కష్టపడి చదివి పరీక్షకు హాజరయ్యేందుకు వచ్చానని.. తన గుర్తింపు కార్డును తీసుకువస్తున్నారని పరీక్ష రాసేందుకు ప్రవేశ మివ్వాలని పరీక్ష కేంద్రం నిర్వాహకులను బ్రతిమాలడడం అందరినీ కలచివేసింది. కాగా టీఎస్ పీ ఎస్సీ నిబంధనలను ఉల్లంఘించలేమని అధికారులు తెలుపడంతో బోరున విలపిస్తూ వెనుదిరిగింది.

పరీక్ష కేంద్రం ఏర్పాటుపై అసంతృప్తి..

మండల కేంద్రానికి అనుబంధ గ్రామమైన ఎల్లంపల్లిలోని ఆదర్శ విద్యాలయంలో పరీక్ష కేంద్రం ఏర్పాటు చేయడంపై పలువురు అభ్యర్థులు అసంతృప్తి వ్యక్తం చేశారు. పరీక్ష కేంద్రం వద్దకు రవాణ సౌకర్యం లేక తీవ్ర ఇబ్బందుల ఎదుర్కొన్నామని.. కనీస సౌకర్యాల్లేని విద్యాల యంలో పరీక్ష కేంద్రం ఏర్పాటు చేయడం అనాలోచితమైం దని అభ్యర్థుల బంధువులు, సన్నిహితులు వాపోయారు.

ఈనెల 4న జాబ్ మేళా

నవతెలంగాణ-సంగారెడ్డి

జిల్లా ఉపాధి శాఖ ఆధ్వర్యంలో ఈనెల 4న జాబ్‌మేళా నిర్వహించనున్నట్టు జిల్లా ఉపాధి అధికారి వందన శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇన్స్యూర్ ఫిన్ సర్వ్ కంపెనీ లో(20) ఉద్యోగాల భర్తీకి 4న ఉదయం 11 గంటల నుంచి 2 గంటల వరకు సంగారెడ్డి బైపాస్ రోడ్డులో గల పాత వెలుగు ఆఫీస్‌లోని జిల్లా ఉపాధి కార్యాలయ ప్రాంగణంలో జాబ్‌మేళా ఉంటుందన్నారు. అభ్యర్థుల వయస్సు 30 నుంచి 60 ఏండ్లలోపు ఉండాలన్నారు. ఇంటర్మీడియట్, ఏదేని డిగ్రీ, పోస్ట్ గ్రాడ్యుయేట్ విద్యార్హతలు గల అభ్యర్థులు అర్హులన్నారు. ఎంపికైన వారికి వేతనం రూ.10 వేల నుండి 15,000 వేల వరకు ఉంటుందన్నారు. ఆసక్తి, అర్హత గల అభ్యర్థులు ఈనెల 4న నిర్ణీత సమయంలోగా విద్యార్హతల ధ్రువపత్రాలు, ఎస్-ఎస్‌సి మెమో, ఆధార్‌కార్డ్, కుల ధ్రువీకరణ సర్టిఫికెట్ల జిరాక్స్ ప్రతులతో నేరుగా జాబ్ మేళాకు హాజరు కావాలని సూచించారు. మరిన్ని వివరాలకు ఫోన్ నెంబర్ 08455-271010 లో సంప్రదించవచ్చన్నారు.

విద్యార్థులకు బస్సు ఏర్పాటుపై హర్షం

నవతెలంగాణ-జిన్నారం



మండల కేంద్రమైన జిన్నారంలో గల స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థుల సౌకర్యార్థమై న్యూ ల్యాండ్ పరిశ్రమ బస్సు ఏర్పాటు చేయడంతో పాఠశాల ప్రధానో పాధ్యాయులు నరేష్ ఉపాధ్యాయ బృందం సంతోషం వ్యక్తం చేశారు. విద్యార్థులకు బస్సు సౌకర్యం కల్పించేందుకు ప్రత్యేకంగా చొరవ తీసుకున్న పటాన్చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి, స్థానిక ఎంపీటీసీ బీఆర్ ఎస్ రాష్ట్ర నేత జిన్నారం వెంకటేశం గౌడ్, జిన్నారం గ్రామ పంచాయతీ సర్పంచ్ అంతి రెడ్డి గారి లావణ్య శ్రీనివాస్ రెడ్డి, ఉప సర్పంచ్ నీలం సంజీవ, పంచాయతీ పాలకవర్గం, పాఠశాల ఉపాధ్యాయ బృందం కృతజ్ఞతలు తెలిపారు.



గజ్వేల్ ధనలక్ష్మి కాలనీలో చోరీ

- సుమారు 12 తులాల బంగారం అపహరణ

నవతెలంగాణ-ప్రజ్ఞాపూర్

ఇంట్లో ఎవరూ లేని సమయంలో గుర్తు తెలియని దుండగులు చోరీకి పాల్పడి.. 12 తులాల బంగారం అపహరించిన ఘటన గజ్వేల్ పట్టణంలోని ధనలక్ష్మి కాలనీలో శుక్రవారం అర్ధరాత్రి జరిగింది. స్థానికుల తెలిపిన వివరాల ప్రకారం.. గజ్వేల్ మండలం అనంతరావుపల్లి గ్రామానికి చెందిన బైరం రమేష్ గత నాలుగేండ్లుగా పట్టణంలోని ధనలక్ష్మి కాలనీలో అద్దెకు ఉంటున్నాడు. ఇటీవల తొలి ఏకాదశి పండుగ సందర్భంగా స్వగ్రామమైన అనంతరావుపల్లికి వెళ్ళాడు. ఇంట్లో ఎవరూ లేరని గమనించిన దుండగులు శుక్రవారం అర్ధరాత్రి చోరీకి పాల్పడ్డారు. ఇంట్లో బీరువాను పగలగొట్టి సుమారు 12 తులాల బంగారాన్ని ఎత్తుకెళ్లారు. శనివారం ఉదయం కుటుంబ సభ్యులతో కలిసి ఇంటికి వచ్చిన రమేష్.. బెడ్ రూమ్ లోకి వెళ్లి చూడగా.. బీరువాలో ఉన్న బంగారు ఆభరణాలు, విలువైన డాక్యుమెంట్స్, బట్టలు చిందరవందరగా ఉన్నాయి. దీంతో దొంగతనం జరిగినట్టు గమనించి స్థానిక పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే పోలీసులు ఘటనా స్థలానికి వచ్చి ఆధారాలు సేకరించే పనిలో నిమగ్నమయ్యారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని గజ్వేల్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.



దుబ్బాక ఎస్ఐకి సన్మానం

నవతెలంగాణ-దుబ్బాకరూరల్

దుబ్బాక ఎస్సై మహేందర్ సీఐగా పదోన్నతి పొందిన సందర్భంగా దుబ్బాక మండల ఎంపీటీసీల ఫోరం తరపున శనివారం వారిని శాలువాతో సత్కరించి అభినందించారు. ఈ కార్యక్రమంలో మండల ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు మంద చంద్ర సాగర్, వైస్ ఎంపీపీ రవి, ఎంపీటీసీ రామ్ రెడ్డి తదితరులున్నారు.



ప్రభుత్వ భూములను కబ్జాదారుల నుంచి కాపాడాలి

నవతెలంగాణ-అమీన్‌పూర్

అమీన్‌పూర్ మండలంలోని సుల్తాన్ పూర్ , కిష్టారెడ్డిపేట, పటేల్ గూడ, బొమ్మనకుంట, అమీన్ పూర్ పట్టణంలోని బీరంగూడ, అమీన్పూర్ తదితర ప్రాంతాలలో గ్రామాలలో పెద్ద ఎత్తున ప్రభుత్వ భూములు కబ్జాలకు గురవుతున్నాయని సీపీఐ(ఎం) పటాన్చెరు ఏరియా కమిటీ కార్యదర్శి నరసింహారెడ్డి ఆరోపించారు. ప్రభుత్వ భూములను కాపాడాలని స్థానిక అమీన్ పూర్ తహసీల్దార్‌కు సీపీఐ(ఎం)ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని వివిధ గ్రామాలలో ప్రభుత్వ భూములు , చెరువులు, గుట్టలు, కుంటలు, కాలువలు కబ్జాలకు గురవుతున్నాయన్నారు. కబ్జాల గురవుతున్న విషయాలు ఎప్పటికప్పుడు వివిధ పత్రికల ద్వారా, వివిధ పార్టీల ద్వారా, స్వచ్ఛంద సంస్థల ద్వారా ప్రభుత్వ అధికారులకు వినతి పత్రాలు ఇవ్వడం.. ప్రచార మాధ్యమంలో రావడం జరుగుతున్నది కానీ ప్రభుత్వ అధికారులు ఏదో పట్టి పట్టనట్టుగా వ్యవహరిస్తున్నారన్నారు. అప్పుడప్పుడు వాటిని కూల్చివేయడం మళ్ళీ మర్చిపోతున్నారన్నారు. రాజకీయ నాయకుల, ప్రజా ప్రతినిధుల అండదండలతో కబ్జాదారులు స్వేచ్ఛగా అక్రమాలు చేస్తున్నారని విమర్శించారు. ఆక్రమించిన వారు ఎవరో తెలిసినా కేసులు నమోదు చేయకపోవడం ఏంటని ప్రశ్నించారు. కబ్జాదారులపై కఠినంగా వ్యవహరిస్తే మళ్లీ కబ్జా చేయడానికి అవకాశం లేకుండా ఉండేదని ఏదైతే ప్రభుత్వ భూములు ఉన్నాయో వాటికి బోర్డులు ఏర్పాటు చేసి ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అమీన్పూర్ పట్టణంలో ప్రభుత్వ భూములను పట్టా భూములుగా డాక్యుమెంట్స్ సృష్టించి స్వేచ్ఛగా నిర్మాణాలు చేస్తున్నారని తప్పుడు సర్వేలతో తప్పుడు డాక్యుమెంట్స్‌తో నిర్మాణం చేస్తున్న వాటిని వెంటనే కూల్చివే యాలని.. వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఎం పార్టీ మండల నాయకులు జార్జ్, వీరస్వామి, శ్రీనివాస్ రెడ్డి, శ్రీనివాస్ పాల్గొన్నారు.



మల్లికార్జునపల్లిలో వైభవంగా గంధం ఊరేగింపు

నవతెలంగాణ-మునిపల్లి

శుక్రవారం రాత్రి మిలాదున్ నబీ పండుగ పురస్కరించుకుని మల్లికార్జునపల్లిలో శనివారం ముస్లిం సోదరులు గంధం ఊరే గింపు కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహి ంచారు. ఈ సందర్భంగా గంధంను మసీదు నుంచి ఊరేగింపుగా గ్రామ సమీపంలోని సయ్యద్ షా ఫక్రుద్దీన్ ఖాదిరి అలీ హుసేని దర్గా వరకు నిర్వహించారు. ఈ గంధం ఊరేగింపు గ్రామ పురవీ ధుల గుండా డప్పుచప్పుల మధ్య ఆటపాటలతో కొనసాగింది. ఈ కార్యక్రమంలో సజ్జద్ నసీన్, సయ్యద్ రఫీ ఉద్దీన్ ఖాద్రి, అల్ హుసేని బంధ నవాజీ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయిలో మెరిసిన సిద్దిపేట వెన్నెల

- ఇందిరాగాంధీ కృషి విశ్వవిద్యాలయ పీహెచ్‌డీ పరీక్షలో బక్రిచెప్యాల అమ్మాయికి జాతీయ స్థాయి మొదటి ర్యాంకు
- అడవులపై పరిశోధన చేసే అరుదైన అవకాశం
- ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రంలోని రాయపూర్ యూనివర్సిటీకి ఎంపిక
- ప్రత్యేకంగా అభినందించిన మంత్రి హరీశ్‌రావు

నవతెలంగాణ-సిద్దిపేటఅర్బన్



అన్ని రంగాల్లోనూ రోల్‌మాడల్‌గా మారిన సిద్దిపేట నియోజకవర్గ కీర్తి మరోసారి జాతీయ స్థాయిలో మార్మోగింది. సిద్దిపేట అర్బన్ మండలం బక్రిచెప్యాలకు చెందిన పురుమాండ్ల వెన్నెలకు అడవులపై పరిశోధన చేసే అరుదైన అవకాశం దక్కింది. దేశంలోనే ప్రతిష్టాత్మకమైన ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రంలోని రాయపూర్‌లో గల ఇందిరాగాంధీ కృషి విశ్వవిద్యాలయంలో పీహెచ్‌డీ విద్యనభ్యసించడానికి గత మే నెల 28న అర్హత పరీక్షలు నిర్వహించారు. ఇందులో పీహెచ్‌డీ సీటు దక్కించుకోవడానికి దేశవ్యాప్తంగా పెద్ద సంఖ్యలో పోటీపడ్డారు. కానీ జాతీయ స్థాయిలో వెన్నెలకు మొదటి స్థానం దక్కింది. వెన్నెల జిల్లా వెటర్నరీ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు పురుమాండ్ల కొండల్‌రెడ్డి-రేవతిల తొలి సంతానం. మిగితా ఇద్దరు అమ్మాయిలను చదువులో ప్రోత్సహిస్తున్నారు. కాగా పదో తరగతి వరకు సిద్దిపేట లోని టూలిప్ స్కూల్‌లో చదివిన వెన్నెల.. హైదరాబాద్‌లో ఇంటర్ పూర్తి చేసింది. ములుగులోని ఫారెస్టు కళాశాలలో బీఎస్సీ ఫారెస్టు, ఉత్తర్‌ప్రదేశ్ రాష్ట్రంలో గల బెనారస్ హిందూ యూనివర్సిటీలో అగ్రో ఫారెస్టు పీజీ విద్యనభ్య సించింది. ఆనాడు పీజీ అర్హత పరీక్షలోనూ జాతీయ స్థాయిలో 9వ రాంక్ సాధించింది. తాజాగా పీహెచ్‌డీ మొదటి ర్యాంకుతో మూడేళ్లపాటు రాయపూర్‌లో అడవులపై పరిశోధన నిర్వహించడానికి సిద్ధమైంది. మన సిద్దిపేట ప్రాంతం గర్వపడేలా పురుమాండ్ల వెన్నెల జాతీయ స్థాయి లో మొదటిర్యాంకు పొందడం నిజంగా చాలా సంతోషమైన విషయం అని మంత్రి హరీశ్‌రావు అన్నారు. ఎంతోమంది విద్యార్థులకు వెన్నెల స్ఫూర్తిగా నిలిచింది. భిన్నమైన రంగాన్ని ఎంచుకోవడమే గాకుండా ఆ రంగంలో అద్భుతాలు సృష్టిస్తు న్నదన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ కృషి వల్ల నెలకొల్పిన ములుగు ఫారెస్టు కాలేజీలో బీఎస్సీ చదివి ఆ తర్వాత బెనారస్ యూనివర్సిటీలో పీజీ, ఇప్పుడు రాయపూర్ యూనివర్సిటీలో పీహెచ్‌డీ చేయడమంటే అసాధారణమైన ప్రతిభతో వెన్నెల శ్రమించడమే ఇందుకు కారణం. వెన్నెలకు, ఆమె తల్లిదండ్రులకు అభినందనలు తెలిపారు.

ఆరోగ్య కేంద్రాల నిర్మాణాలను పూర్తి చేయాలి

నవతెలంగాణ-కొండపాక



ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, సబ్ హెల్త్ కేంద్రాల నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ప్రశాంత్ జే.పాటిల్ వైద్య ఆరోగ్యాశాఖ మరియు పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ వైద్య, ఆరోగ్యాశాఖ మరియు పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారులతో సమావేశం నిర్వహించి.. జిల్లాలో చేపట్టిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు మరియు సబ్ హెల్త్ సెంటర్ల భవన నిర్మాణాలు, మరమ్మత్తు పనుల ప్రగతి పై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో నూతనంగా 5 పిహెచ్సి లు, 100 సబ్ హెల్త్ కేంద్రాలను, నిర్మించేందుకు అలాగే 21 పీహెచ్సీలు, 56 హెల్త్ సబ్ సెంటర్ల మరమ్మతులు పనులు ప్రారంభించడం జరిగిందని వాటిని త్వరగా పూర్తి చేసి ప్రజల వైద్య సేవల కొరకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. వాటి నిర్మాణం పై రాష్ట్ర ఆర్థిక, వైద్య, ఆరోగ్య మరియు కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి తన్నీరు హరీష్ రావు ప్రత్యేకంగా పర్యవేక్షిస్తున్నందున నిర్మాణ పనుల్లో ఎలాంటి అలసత్వం వహించకుండా త్వరగా పూర్తి చేయాలని పంచాయతీరాజ్ ఇఇ శ్రీనివాస్ రెడ్డి, టీఎస్ ఎంఐడీసీ డిఈ విశ్వ ప్రసాద్ లను ఆదేశించారు. అదేవిధంగా ప్రత్యేక శ్రద్ధ చూపి త్వరగా నిర్మాణాలు పూర్తయ్యాలా పర్యవేక్షించాలని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్. కాశీనాథ్, ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ అజీముద్దీన్‌లకు సూచించారు.

ముత్యంపేట అభివృద్ధికి సంపూర్ణ సహకారం

- మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డి
- ప్రజలతో మమేకమై, సమస్యల పరిశీలన

నవతెలంగాణ-తొగుట



'అమ్మా బాగున్నారా.. నీళ్లు వొస్తున్నాయా.. కరెంటు బాగుందా.. తెలంగాణ రాకముందు ఇవన్నీ వొచ్చా యా.. అని ఇవన్నీ మనకు తెలంగాణ వొచ్చిన తర్వాతే సాధ్యమయ్యాయి' అని మెదక్ పార్లమెంటు సభ్యులు, బీఆర్ఎస్ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు కొత్త ప్రభాకర్ రెడ్డి అన్నారు. మండలంలోని గోవర్ధనగిరి మధిర చిన్న ముత్యం పేటలో శనివారం పర్యటించి.. గ్రామస్తులతో ఆత్మీయంగా మాట్లాడారు. తెలంగాణలోనే మొదటిసారిగా చిన్న ముత్యంపేటలో 22 డబుల్ బెడ్రూం ఇళ్లను పంపిణీ చేసిన విషయం గుర్తు చేశారు. గోవర్ధనగిరిలో అంగన్వాడీ కేంద్రం ఉండటంతో ఇబ్బందిగా మారిం దని, ముత్యంపేటలో అంగ న్వాడీ కేంద్రం ఏర్పాటు చేయాలని కోరారు. అలాగే పక్కా ఇళ్ల నిర్మాణం కోసం సహకరించాలని, సీలింగ్ భూమిలో ఉండటంతో తమకు పట్టా అవకాశం కల్పించాలని గ్రామ స్తులు కోరారు. ఉప ఎన్నికల్లో గెలిచిన ఎమ్మెల్యే ఏం చేస్తున్నా డని ఎంపీ వారిని ప్రశ్నించగా.. ఏం చేస్తలేరని వారు సమాధానం ఇచ్చారు. కాగా వారి సమస్యలను విడతల వారీగా పరిష్కరిస్తామన్నారు. సీఎం కేసీఆర్‌కు అండగా నిల వాలన్నారు. కాగా వొచ్చే ఎన్నికల్లో మీకే ఓట్లు వేసి గెలిపిస్తామని ప్రజలు జవాబిచ్చారు. ఈ కార్యక్రమంలో సొసైటీ చైర్మెన్ కె.హరికృష్ణా రెడ్డి, పార్టీ మండలాధ్యక్షులు జీడిపల్లి రాంరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మెన్ దోమల కొమురయ్య,వైస్ చైర్మన్లు కంది రాంరెడ్డి, సర్పంచ్ తోయేటి ఎల్లం, గంగనిగల్ల మల్లయ్య, మాజీ మండ ల పార్టీ అధ్య క్షుడు సిలువేరి మల్లారె డ్డి, మాజీ మా ర్కెట్ కమిటీ చైర్మెన్ బక్క కనకయ్య, ఉప సర్పంచ్ ఇందిర, బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

స్టూడెంట్ ఒలింపిక్ క్రీడల్లో స్థానిక విద్యార్థుల ప్రతిభ

- మూడో స్థానంలో నిలిచి సత్తా చాటిన హోతి(కే) రెసిడెన్సియల్ స్కూల్ విద్యార్థులు
- శాలువాతో సన్మానించి అభినందించిన ఎమ్మెల్యే

నవతెలంగాణ-జహీరాబాద్



శ్రీలంకలోని కొలంబియాలో జరుగుతున్న స్టూడెంట్స్ ఇంటర్నే షనల్ ఒలింపిక్ పోటీలో జహీరాబాద్ నియోజకర్గ విద్యార్థులు సత్తాచాటారు. ఇండియా తరఫున వాలీబాల్ విభాగంలో థాయిలాండ్‌పై పోటీపడి మూడో స్థానంలో నిలిచారు. హోతి(కే)లోని సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ బాలికల్ జూనియర్ కళాశాల, రెసిడెన్షియల్ స్కూల్‌కు చెందిన విద్యార్థులు.. ఈ ఘనత సాధించడం పట్ల ఎమ్మెల్యే హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు శనివారం విద్యార్థులను, కోచ్ దీపను శాలవాతో సన్మానించి అభినందించారు. సీఎం కేసీఆర్ అందిస్తున్న అవకాశాలను అందిపుచ్చుకుని ఇలాంటి ఘనత సాధించడం హర్షణీయమన్నారు. రెసిడెన్షియల్ స్కూల్‌లు, కాలేజీలు ఏర్పాటు చేసి పేదలందరికీ విద్యను అందిస్తున్నారని కొనియాడారు. ఇలానే ముస్ముందు అన్ని క్రీడల్లో మన నియోజకవర్గ విద్యార్థులు విజయాలు సాధించాలని.. వారికి ఎల్లవేళలా అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తామన్నారు. కార్యక్రమంలో కోచ్ దీప, ఆత్మ కమిటీ చైర్మెన్ పెంటారెడ్డి, ఇప్పేపల్లి పీఏసీఎస్ చైర్మెన్ దాసరి మచ్చేందర్, మాజీ కౌన్సిలర్ బండి మోహన్, సర్పం చ్‌లు విజయ్, సంజీవ్ నాయకులు లక్ష్మీకాంత్ పాల్గొన్నారు.

కాలువ నిర్మాణాన్ని పొడగించాలి



నవతెలంగాణ-కొండపాక

గజ్వేల్ పట్టణంలో మల్లన్న సాగర్ పునరావాస కాలనీకి అనుకుని నూతనంగా నిర్మిస్తున్న కాలువను పొడిగించాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు సందబోయిన ఎల్లయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు . శనివారం కలెక్టర్ కార్యాలయ పరిపాలన అధికారికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అర్బన్‌పార్క్, బంజరపల్లి గ్రామానికి కేటాయించిన ఇండ్ల నుండి, వివిధ ప్రాంతాల నుంచి వచ్చే నీటితో పాటు వర్షం నీరు రావడానికి మురికి కాలువను కాలనీ చివరి వరకు మాత్రమే నిర్మించడంతో చివర ఉన్న సుమారు 20 ఎకరాల పంట పొలాలు మునిగిపోవడానికి అవకాశం ఉందన్నారు. సుమారు 150 మీటర్లు కాల్వ పొడిగిస్తే.. రైతుల పొలాలకు నష్టం ఉండదని, కింద కుంటలో వెళ్లడానికి అవకాశం ఉంటుందన్నారు. కాబట్టి ప్రభుత్వం జోక్యం చేసుకొని పూర్తిస్థాయిలో కాలువ నిర్మించి రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఇక్బాల్, జాంగిర్, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

చేర్యాల రెవెన్యూ డివిజన్ సాధనకు..

బలమైన ఉద్యమాన్ని నిర్మిద్దాం

- జడ్పీటీసీ గిరి కొండల్ రెడ్డి, జేఏసీ చైర్మన్ పరమేశ్వర్

నవతెలంగాణ-మద్దూరు



చేర్యాల రెవెన్యూ డివిజన్ కోసం బలమైన ఉద్యమాన్ని నిర్మిద్దామని మద్దూరు జడ్పీటీసీ, కాంగ్రెస్ జెడ్పి ఫ్లోర్ లీడర్ గిరి కొండల్ రెడ్డి, జేఏసీ చైర్మన్ డాక్టర్ రామగల్ల పరమేశ్వర్, అన్నారు. శనివారం మండల కేంద్రంలోని జేఏసీ యూత్ నియోజకవర్గ నాయకుడు గద్దల మహేందర్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. చేర్యాల రెవెన్యూ డివిజన్ సాధన కోసం అన్ని గ్రామాల్లో కమిటీలు నిర్మాణం చేపట్టి బలమైన ఉద్యమాన్ని నిర్మించడానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. గత కొన్నేండ్లుగా రెవెన్యూ డివిజన్ కేంద్రంగా ఏర్పాటు చేయాలని అనేక ఆందోళన కార్యక్రమాలు చేస్తూ.. గ్రామ పంచాయతీలు తీర్మానం చేసి స్థానిక ఎమ్మెల్యే కు అందజేసినప్పటికీ నేటి వరకూ ఎలాంటి స్పందన లేదని విమర్శించారు. చేర్యాల నియోజకవర్గాన్ని కోల్పోవడంతో పాటు అశాస్త్రీయంగా విడదీసి మండలాలను చెరో ప్రాంతాలకు విడదీసి ముక్కలు చెక్కలు చేసి ఈ ప్రాంత ప్రజలకు తీవ్ర అన్యాయం చేశారని మండిపడ్డారు. అన్ని అర్హతలు కలిగిన చేర్యాలను రెవెన్యూ డివిజన సాధన కోసం, పాత చేర్యాల నియోజకవర్గాన్ని పున :రుద్ధరించాలని కోరుతూ గ్రామస్థాయిలో ప్రజలను చైతన్యపరిచి గ్రామ స్థాయిలో ఉద్యమాన్ని మరింత ముందుకు తీసుకెళ్లాలని వారు పిలుపునిచ్చారు. అనంతరం 18 మందితో కమిటీని ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో జేఏసీ కో చైర్మన్ పూర్మ ఆగంరెడ్డి, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు అందె అశోక్, జేఏసీ నియోజకవర్గ నాయకులు గద్దల మహేందర్, సర్పంచ్‌లు బండి శ్రీనివాస్, కూకట్ల బాల్ రాజు, ఎంపీటీసీ చేటుకురి కల్యాణి-కమలాకర్, మాజీ సర్పంచ్ లు బండి చంద్రయ్య, సుద్దాల రేణుక-నర్సయ్య, ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకుడు సుందరగిరి భాస్కర్, అఖిలపక్షం నాయకులు వలబోజు నర్సింహా చారి, పరిది కనకయ్య, సాంబ మూర్తి, గోనెపల్లి రమేష్, గోనెపల్లి రాజు, చిలుక రాజయ్య పాల్గొన్నారు.


ప్రేమ పేరుతో యువకుడి మోసం..

బాధితురాలితో పెండ్లి చేయించిన ప్రజాసంఘాలు

నవతెలంగాణ-దౌల్తాబాద్



ప్రేమ పేరుతో నమ్మించి మోసం చేసిన యువకుడుకి ప్రజాసంఘాల ఆధ్వర్యంలో యువతితో వివాహం జరిపించిన ఘటన దౌల్తాబాద్ మండలం గొడుగుపల్లిలో జరిగింది. వివరాల్లోకి వెళ్తే.. గొడుగుపల్లి గ్రామానికి చెందిన వివేక్ గౌడ్ అనే యువకుడు అదే గ్రామానికి చెందిన ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన అమ్మాయిని ప్రేమ పేరుతో నమ్మించాడు. పెండ్లి చేసుకుంటానని మాయ మాటలు చెబుతూ అమ్మాయిని గర్భవతిని చేశాడు. అయితే గర్భాన్ని అబార్షన్ చేయించి చేతులు దులుపుకుందాం అని ప్రయత్నించాడు. అమ్మాయి కుటుంబ సభ్యులతో చాటుమాటు బేరం కుదుర్చుకున్నాడు. ఈ విషయం సోషల్ మీడియాలో ప్రచారం కావడంతో.. పలు ప్రజాసంఘాల నాయకులు బాధితురాలికి న్యాయం చేయాలని.. బాధిత కుటుంబం సభ్యులకు ధైర్యం చెప్పి పోలీసులు స్టేషన్‌లో ఫిర్యాధు చేయించారు. పోలీసులు, పలు ప్రజా సంఘాల ఆధ్వర్యంలో జరిపిన చర్చల్లో రణం వివేక్ గౌడ్ బాధితురాలిని పెళ్ళి చేసుకుంటానని ఒప్పుకోవడంతో స్థానిక వెంకటేశ్వర స్వామి ఆలయంలో వివాహం జరిపించారు. వివాహం జరిపించిన వారిలో సీఐటీయు మెదక్ జిల్లా ఉపాధ్యక్షుడు మల్లేశం, బిఆర్ఎస్ నాయకులు డప్పు శివరాజ్, గొడుగుపల్లి సర్పంచ్ శివకుమార్, మాజీ ఎంపిటిసి మద్దెల స్వామి,ఉప సర్పంచ్ బాబు,అమరేందర్ రెడ్డి,మద్దెల మల్లయ్యరత్నం, దుర్గని నర్సింలు తదితరులు ఉన్నారు.



ఇండ్లు కూలిన కుటుంబాలకు చెక్కులు పంపిణీ

నవతెలంగాణ-నారాయణఖేడ్



నియోజకవర్గంలోని వివిధ గ్రామాల్లో అకాల వర్షాలకు ప్రమాద వశాత్తూ ఇండ్లు కూలిన కుటుంబాలకు.. ప్రభుత్వం నుంచి సాయంగా మూడు వేల రూపాయల చెక్కులను ఖేడ్ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్ రెడ్డి శనివారం లబ్దిదారులకు అందజేశారు. ఖేడ్ మండలంలోని ఆక్లెతాండా, పీర్లతాండాకు చెందిన లబ్ధిదారులకు ఈ సాయాన్ని అంద జేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర రైతుబంధు సమితి డైరెక్టర్ మారుతి, మండల జెడ్పీటీసీ రాథోడ్ లక్ష్మీబాయి రవీందర్ నాయక్, ఎంపీపీ తన యులు కర్ర రమేష్ చౌహాన్, ఎంపీటీసీరాజు, కౌన్సిలర్ స్వప్న అభిషేక్ షేట్కార్ తదితరులు పాల్గొన్నారు.

రెడ్డి సంఘం భవన నిర్మాణానికి భూమిపూజ

నవతెలంగాణ-నారాయణఖేడ్



మండలంలోని వెంకటాపూర్ శివారులో గల ఎంపీడీవో కార్యాలయం వద్ద చిట్టెపురెడ్డి సంఘం భవన నిర్మాణానికి ఖేడ్ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్ రెడ్డి శనివారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. 3 గుంటల స్థలం మరియు భవన నిర్మాణానికి రూ.5 లక్షలు మంజూరు చేశామన్నారు. అనంతరం ఎమ్మెల్యేని సన్మానించి సిద్దేశ్వరుడి చిత్రపటాన్ని బహూకరించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ రాథోడ్ లక్ష్మీబాయి రవీందర్ నాయక్, ఎంపీపీ తనయులు కర్ర రమేష్ చౌహాన్, మండల రైతు సమన్వయ సమితి అధ్యక్షులు మరియు నియోజకవర్గ చిట్టేపు రెడ్డి సంఘం అధ్యక్షులు సత్యపాల్ రెడ్డి, మున్సిపల్ చైర్మెన్ రుబీనా నజీబ్, పీఏసీఎస్ నర్సింహా రెడ్డి, సంఘం నాయకులు వెంకటరమణా రెడ్డి,గోపాల్ రెడ్డి,నర్సింహా రెడ్డి,మధుసూధన్ రెడ్డి,ఎంపీటీసీ అశోక్ రెడ్డి,సర్పంచ్ లు జైపాల్ రెడ్డి,సంజీవ్ రెడ్డి,అంజి రెడ్డి,నాయకులు అంజి రెడ్డి,కట్టకింది సంజీవ్ రెడ్డి,గోవర్ధన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఈనెల 12న సదరం శిబిరం

నవతెలంగాణ-సంగారెడ్డి

ప్రతినెల నిర్వహించు సదరం శిబిరాన్ని ఈనెల 12న (రెండవ మంగళవారం) నిర్వహిస్తున్నట్టు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ గాయత్రీ దేవి శనివారం ఓ ఒక ప్రకటనలో తెలిపారు. సంబంధిత స్లాట్స్ జూలై, 4న కేటాయి స్తాంని తెలిపారు. అర్హులైన అభ్యర్థులు మీసేవ ద్వారా స్లాట్స్‌బుక్ చేసుకుని, సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రిలో నిర్వహించు సదరం క్యాంపుకు హాజరు కావాలన్నారు.



సొంత నిధులతో విద్యార్థులకు రవాణా సౌకర్యం

నవతెలంగాణ-గుమ్మడిదల

మండలంలోని మంబాపూర్ గ్రామ విద్యార్థులు ఉన్నత చదువుల కోసం మంబాపూర్ గ్రామం నుంచి గుమ్మడిదల గ్రామానికి ఎన్నో రోజులుగా నడిచి వెళున్నారు. అయితే ఈ విషయాన్ని విద్యార్థుల తల్లిదండ్రులు బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు, చిట్కుల్ సర్పంచ్ నీలం మధు ముదిరాజ్ దృష్టికి తీసుకుపోవడంతో ఆయన వెంటనే స్పందించారు. తన సొంత ఖర్చులతో రెండు ఆటోలను విద్యార్థులకు రవాణా సౌకర్యంగా ఏర్పాటు చేశారు. శనివారం నుంచే విద్యా ర్థులను పాఠశాలకు తీసుకువెళ్లి తీసుకువచ్చే విధంగా.. ఎంఎస్ఆర్ యువసేన సభ్యుల చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కంజర్ల శ్రీనివాస్, ఉప సర్పంచ్ దయానంద్, మండల ఎస్ఎంఆర్ యువసేన నాయకులు తుజాల్ పూర్ వీరేశ్, జింక గోపాల్, విష్ణు, ముత్యాలు, అశోక్, దేవునిచెరువు నర్సింలు, సురేష్, దోమడుగు నాగరాజు, శంకర్, ప్రకాశ్, విజయ్, నర్సింలు, శ్రీకాంత్, ప్రశాంత్, నాగరాజు, అరుణ్, యువసేన సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



ప్రభుత్వ డాక్టర్లకు శాలువాతో సన్మానం

నవతెలంగాణ-గుమ్మడిదల

డాక్టర్స్ డే ను పురస్కరించుకొని గుమ్మడిదల మండలానికి చెందిన మైత్రీ ఫౌండేషన్ చైర్మెన్, బీజేపీ నాయకులు చెన్నంశెట్టి ఉదయ్ కుమార్ శనివారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ప్రభుత్వ డాక్టర్ మధుకర్‌ను శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా ఉదయ్ కుమార్ మాట్లాడుతూ.. కరోనా విజృంభిస్తున్నప్పటికీ తమ ప్రాణాలను కూడా లెక్కచేయకుండా, అంకితభావంతో ప్రజలకు వైద్యసేవలందించిన వైద్యులను నిజంగా గొప్పవారు అని కొనియాడారు.ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది అనసూయ, ప్రతిభ, శారదా తదితరులు పాల్గొన్నారు.



గడపగడపకు వైఎస్సార్ టీపీ

నవతెలంగాణ-సదాశివపేట

మండలంలోని వెల్టూరు, ముబాకర్‌పూర్ గ్రామాల్లో శనివారం వైఎస్సార్ టీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి లక్ష్మారెడ్డిగారి సాయినాథ్‌రెడ్డి గడపగడపకు వైఎస్సార్ టీపీ కార్యక్రమాన్ని చేపట్టారు. ఇంటింటికి తిరుగుతూ తమ పార్టీ అధికారంలోకి వస్తే ప్రజలకు అందించే సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు.

మండల కేంద్రంలో ఆధార్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలి



నవతెలంగాణ-గుమ్మడిదల

గుమ్మడిదల మండల కేంద్రంలో ఆధార్ కేంద్రం లేకపోవడంతో ప్రజలు ఎన్నో ఇబ్బందులకు గురవుతున్నారని.. వెంటనే ఇక్కడ ఆధార్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు పుట్ట నర్సింగరావు డిమాండ్ చేశారు. మండల రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యం వల్ల ఆధార్ కేంద్రాలు మూతపడిపోయాయని ఆరోపించారు. మండ లంలో అభివృద్ధి సంక్షేమ పథకాలతో ప్రజలకు చేరువవుతున్నామని ప్రజలను మభ్య పెడుతున్నారు తప్పా.. మండల ప్రజా ప్రతినిధులకు ఆధార్ కేంద్రం ఏర్పాటు చేయాలన్న ఆలోచన కూడా రావడం లేదన్నారు. వెంటనే సంబంధిత అధికారులు ప్రత్యేక చొరవ తీసుకొని మండల కేంద్రంలో ఆధార్ కేంద్రాన్ని ఏర్పాటు చేసే విధంగా చర్యలు చేపట్టాలన్నారు.



వాసవి క్లబ్ ఆధ్వర్యంలో వైద్యులకు సన్మానం

నవతెలంగాణ-సదాశివపేట

ప్రపంచ వైద్యుల దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం వాసవి క్లబ్ ఆధ్వర్యంలో పట్టణంలోని పలు నర్సింగ్ హోమ్స్ డాక్టర్లను మర్యాదపూర్వకంగా కలిసి శాలువా, పూలదండలతో సన్మానించి.. శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమాల్లో క్లబ్ అధ్యక్షులు బుగ్గారం శ్రీనివాస్, గౌరవ పెద్దలు కోడూరు అంజయ్య, మల్లికార్జున శంకర్, వాసవి క్లబ్ మాజీ అధ్యక్షులు అశోక్ కుమార్, కంది కృష్ణ, వినోద్ యువజన విభాగం దిడిగే నాగేష్ తదితరులు పాల్గొన్నారు.

ఖమ్మం జనగర్జనను జయప్రదం చేయండి



నవతెలంగాణ-సంగారెడ్డి

నేడు ఖమ్మంలో జరిగే కాంగ్రెస్ పార్టీ జనగర్జనను జయప్రదం చేయాలని ఆ పార్టీ సంగారెడ్డి మండలాధ్యక్షుడు సిహెచ్. బుచ్చి రాములు కార్యకర్తలకు పిలుపునిచ్చారు. శనివారం క్యాంప్ కార్యాల యంలో మాట్లాడుతూ.. ఖమ్మం సభ రాష్ట్ర రాజకీయాలను మార్చే సభ అన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. ఖమ్మం సభకు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు అధిక సంఖ్యలో పాల్గొనాలన్నారు.

ట్రైడెంట్ పరిశ్రమ తీరు సరికాదు

- పరిశ్రమ ఆస్తులను విక్రయించైనా.. రైతులకు, కార్మికులకు పెండింగ్ డబ్బులు చెల్లిస్తాం
- జిల్లా కలెక్టర్ డాక్టర్ శరత్

నవతెలంగాణ-జహీరాబాద్



స్థానిక ట్రైడెంట్ యజమాన్యం రైతుల పట్ల మొండిగా వ్యవహరించడం మంచి పద్ధతి కాదని జిల్లా కలెక్టర్ అన్నారు. రైతులకు, కార్మికులకు బకాయి ఉన్న డబ్బులను వెంటనే చెల్లించాలన్నారు. కొత్తూరు బి గ్రామ పరిధిలోని ట్రైడెంట్ పరిశ్రమను స్థానిక ఎమ్మెల్యే మాణిక్‌రావు, డీసీఎంఎస్ చైర్మెన్ శివకుమార్, సీడీసీ చైర్మెన్ ఉమాకాంత్ పాటిల్‌లతో కలసి శనివారం పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ.. ట్రైడెంట్ షుగర్ ఫ్యాక్టరీ యాజమాన్యం రైతులకు రూ.12.5 కోట్ల బకాయిలు నేటికీ చెల్లించలేదని.. దీంతో షుగర్ కేన్ కమిషనర్ ఆదేశానుసారం ఆస్తులను జప్తు చేసేందుకు ఆర్ఆర్ ఆక్ట్ ప్రకారం నోటీస్ జారీ చేశామన్నారు. 15 రోజులకు ఒక నోటీసు పంపించడం జరుగుతుందన్నారు. ఇప్పటికే ఒక నోటీసును పంపించావని.. త్వరలోనే రెండో నోటీసు కూడా పంపించి పరిశ్రమ ఆవరణలోని చర, స్థిర ఆస్తులను అమ్మేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నామన్నారు. పరిశ్రమకు 50 ఎకరాల భూమి ఉందని.. సుమారు రూ.35 కోట్ల యంత్ర సామాగ్రి ఉందన్నారు. రైతులు ఎవరూ కూడా అధైర్య పడవద్దని.. వారికి రావాల్సిన ప్రతీ రూపాయని ఇప్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం తరపునుంచి మంత్రి హరీశ్‌రావు ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారన్నారు. మంత్రి ఆదేశానుసారమే పరిశ్రమలో ఉన్న ఆస్తులను పరిశీలించడానికి వచ్చినట్టు కలెక్టర్ తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అధికారులు, మంత్రి హరీశ్‌రావు సమక్షంలో ప్రతినెల సమావేశాలను ఏర్పాటు చేసి.. రైతులకు బకాయి డబ్బులను వెంటనే చెల్లించాలని ఆదేశించినప్పటికీ.. యాజమాన్యం మొండిగా వ్యవహరిం చడం సరి కాదన్నారు. మూడ్రోజులకు మూడు కోట్ల చొప్పున ఇస్తామని గతంలో ఇచ్చిన హామీని కూడా నిలబెట్టుకోలేక పోయారన్నారు. కాగా షుగర్ కేన్ కమిషనర్ రాజశేఖర్ పై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. పరిశ్రమలో ఏ ఏ సామగ్రి ఎంత నిల్వలు ఉన్నాయో వాటికి సంబంధించిన రికార్డులు సైతం కమిషనర్ దగ్గరం లేకపోవడం పట్ల మండిపడ్డారు. ఎలాంటి సమాచారం లేకుండా సమస్యను ఎలా పరిష్కరి స్తారని.. రైతులకు ఏమి సమాధానం చెప్తారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రస్తుత కమిషనర్ రాజశేఖర్‌చ ఆత్మ కమిటీ చైర్మెన్ పెంటారెడ్డి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఈ సీజన్‌లో చెరుకు ఎవరికివ్వాలి..

ట్రైడెంట్ పరిశ్రమను విక్రయిస్తే.. జహీరాబాద్ డివిజన్‌లో ప్రస్తుతం నాటిన చెరుకును ఎవరికి విక్రయించుకోవాలని రైతులు కలెక్టర్ అడిగారు. ముందుగా బకాయి డబ్బులు వచ్చాక.. అనంతరం ఈ విషయంపై ఆలోచిద్దామని కలెక్టర్ సమాధానం చెప్పారు.

పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

నవతెలంగాణ-సంగారెడ్డి



పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 6నుంచి చేపట్టనున్న రాష్ట్ర వ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి జి.సాయిలు పిలుపునిచ్చారు. తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్ జిల్లా కమిటీ సమావేశాన్ని శనివారం సుందరయ్య భవన్‌లో నిర్వహిం చారు. ఈ సందర్భంగా సాయిలు మాట్లాడుతూ.. పంచాయతీ కార్మికులు అనేక ఏండ్ల నుంచి పనిచేస్తూ గ్రామాలను శుభ్రం చేస్తున్నా.. వారికి కనీస వేతనాలు ఇవ్వకపోవడం సరికాదన్నారు. వెంటనే పంచాయతీ కార్మికులకులందరినీ పర్మినెంట్ చేసి.. జీవో 60 ప్రకారం వేతనాలు ఇవ్వాలన్నారు. మల్టీపర్పస్ వర్కర్ విధానం రద్దు చేయాలన్నారు. బిల్ కలెక్టర్లను కారోబార్లుగా, సహాయ కార్యదర్శిగా గుర్తించాలన్నారు. ఈఎస్ఐ, పీఎఫ్ అమలు చేయాలని కోరారు. పెండింగ్ జీతాలు వెంటనే చెల్లించాలని, సబ్బులు నూనెలు బెల్లం అందిం చాలని డిమాండ్ చేశారు. ఆయా సమస్యల పరిష్కారానికి రాష్ట్ర వ్యాప్తంగా అన్ని యూనియన్ల ఆధ్వర్యంలో జేఏసీగా ఏర్పడి రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ కమిషనర్‌కి 17 డిమాండ్లతో సమ్మె నోటీసు ఇవ్వడం జరిగిందన్నారు. జులై 5 వరకు ప్రభుత్వం సమస్యను పరిష్కారించాలని.. లేని యెడల 6వ తేదీ నుంచి అన్ని మండలాల్లో గ్రామ పంచాయతీ సిబ్బంది పనులు బంద్ పెట్టి ఎంపీడీవో ఆఫీస్ వద్ద టెంటు వేసి సమ్మెలోకి వెళ్తారని హెచ్చరించారు. ఈ సమావేశంలో యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు సత్తయ్య, దశరథ్, వెంకటయ్య, నాగేష్, రాధాకృష్ణ, అశోక్, షబ్బీర్, శంకరయ్య, కిష్టయ్య, లక్ష్మీ, అనిత తదితరులు పాల్గొన్నారు.

పెరిగిన ధరలకు అనుగుణంగా వ్యవసాయ కూలి రేట్లు పెంచాలి



నవతెలంగాణ-జహీరాబాద్

పెరిగిన ధరలకు అనుగుణంగా వ్యవసాయ కూలీలకు రోజు కూలి రూ.600 ఇవ్వాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం సంగారెడ్డి జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు శనివారం జహీరాబాద్ వ్యవసాయ కార్మిక సంఘం కార్యాలయంలో వ్యవసాయ కార్మికుల కనీస వేతన చట్టానికి సంబంధించిన కరపత్రాన్ని విడుదల చేశారు. అనంతరం ఆ సంఘం అధ్యక్ష కార్యదర్శులు బి.రామచంద్రం, ఎం.నర్సింలు మాట్లాడుతూ.. రెక్కాడితేగానే డొక్కాడని కూలీలు 70 శాతం మంది ఉన్నారన్నారు. వారందరికీ కనీస వేతన చట్టం ఉందని.. రెవెన్యూ యంత్రాంగం, డీసీఎల్ అధికారులు గ్రామ గ్రామాన ప్రచారం నిర్వహించి ప్రజలకు తెలియజేయాలన్నారు. జీవో 335ను 2018లో రిలీజ్ చేశారని, ఆ జీవో ప్రకారంగా ధరలు పెరిగినప్పుడల్లా కనీస వేతనం పెంచడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. 2011లో చట్ట సవరణ చేసి ప్రతీ రెండేండ్లకొకసారి పెంచాల్సిన కూలీ ని 12 ఏండ్లైనా పెంచడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ధరలు పెంచి పేదలపై, కూలీలపై భారాలు వేస్తున్న ప్రభుత్వాలు కూలీ ఎందుకు పెంచడం లేదని ప్రశ్నించారు. పెరిగిన ధరలకు అనుగుణంగా రోజు కూలి రూ.600 ఇవ్వా లనాన్నరు. లేనియెడల పెద్ద ఎత్తున పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మురళి, లక్ష్మణ్, తుల్జారాం, నరేష్‌అశోక్, సంజీవులు, సరోజమ్మతదితరులు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో డాక్టర్లకు సన్మానం

నవతెలంగాణ-జోగిపేట



డాక్టర్స్ డే సందర్భంగా జోగిపేట లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో శనివారం డాక్టర్లను సన్మానించారు. స్థానిక ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో సూపరిటెండెంట్ డాక్టర్ రమేష్, డాక్టర్ శంకర్ బాబు, డాక్టర్ అనూష, డాక్టర్ వరలక్ష్మి, డాక్టర్ భారతి, డాక్టర్ దివ్య జ్యోతి, డాక్టర్ శ్రీ వీణ, డాక్టర్ తేజ, డాక్టర్ సిద్ధార్థలను అందోల్ తహసీల్దార్ వెంకటేశం, లయన్స్ క్లబ్ డయాబెటిస్ జిల్లా చైర్మెన్ డాక్టర్ కే. అనంతరెడ్డి, జోన్ చైర్మెన్ ఆకుల రాంబాబు, పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు శేరి సంగారెడ్డి, అల్లే శ్రీకాంత్, కోశాధికారి రవి శేఖర్ రెడ్డి, సభ్యులు యశ్వంత్ రెడ్డి, రామకృష్ణ, పి. సంతోష్, జి.సంతోష్‌లు శాలువాలతో సత్కరించారు. అనంతరం ఆయా ప్రభుత్వ పాఠశాలల పిల్లలకు బిస్కెట్ల పంపిణీ, స్కూల్ గ్రౌండ్‌లో హరితహారంలో భాగంగా మొక్కలు నాటారు. స్థానిక డి.ఎన్.రెడ్డి ఆసుపత్రి ఆవరణలో డయాబెటిస్ క్యాంపు నిర్వహించారు. అనాథలకు అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. స్థానిక చిరు వ్యాపారికి గొడుగును బహూకరించారు.

అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలి



నవతెలంగాణ-పటాన్‌చెరు

పటాన్ చెరు డివిజన్ అభివృద్ధి పనుల కోసం నిధులు మంజూరు చేయాలని పటాన్‌చెరు కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్ జోనల్ కమిషనర్ శంకరయ్యను కోరారు. శనివారం అభివృద్ధి పనుల కోసం నిధులు కేటాయించాలంటూ శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ కార్యాల యంలో శంకరయ్యను మెట్టు కుమార్ యాదవ్ కలిసి విన్నవించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పటాన్‌చెరు 113వ డివిజన్ అభివృద్ధి పనుల కోసం నిధులను మంజూరు చేయాలని కోరారు. ఈ సందర్భంగా పటాన్‌చెరులోని వెంకటేశ్వర కాలనీ నూతన సీసీరోడ్డు నిర్మాణం కోసం రూ.53 లక్షలు, ఎం.జి రోడ్డు వెడల్పు పనులకు రూ.33లక్షలు అలాగే పటాన్‌చెరులోని స్మశాన వాటికలో నూతన చితి మండపం నిర్మించే విధంగా నిధులు మంజూరు చేయాలని కోరారు.

వైద్యులను సన్మానించిన బంగారు కృష్ణ


నవతెలంగాణ-సంగారెడ్డి



జాతీయ వైద్యుల దినోత్సవం సందర్భంగా శనివారం సంగారెడ్డి ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో సూపర్ డెంట్ అనిల్ కుమార్‌ను జన జాగృతి సేన అధ్యక్షుడు బంగారు కృష్ణ సన్మానించారు. ఈ సందర్భంగా కృష్ణ మాట్లాడుతూ. అమ్మ నాన్న జన్మనిస్తే.. వైద్యులు పునర్జన్మ ఇస్తారన్నారు. వైద్యం ఖరీదైన ప్రస్తుత పరిస్థితుల్లో.. అనారోగ్యంతో ప్రభుత్వాస్పత్రికి వస్తున్న రోగులకు పగలు రాత్రి అని తేడా లేకుండా నాణ్యమైన వైద్య సేవలు అందిసున్న వైద్యులకు కృతజ్ఞతలు తెలిపారు. ఆర్ఎంఓ డాక్టర్ ఆంజనే యులు, ఆర్ఎంఓ డాక్టర్ రవి కుమార్, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ గోవింద్, డాక్టర్ శ్రీలేఖ, డాక్టర్ రాధిక, డాక్టర్ నాగ లక్ష్మిలను సన్మానించారు. ఈ కార్యక్రమంలో రాజు, చిరంజీవి అభిమాన సంఘం జిల్లా అధ్యక్షుడు లడ్డు చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

సంగారెడ్డి ప్రభుత్వాసుపత్రిలో 134 రకాల పథాలజీ పరీక్షలు

నవతెలంగాణ-సంగారెడ్డి



సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రిలో తెలంగాణ డయాగ్నొస్టిక్స్ 134 రకాల పథాలజీ పరీక్షల అప్‌గ్రేడేషన్‌ను రాష్ట్ర ఆర్థిక, వైద్య ఆరోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు వర్చువల్‌గా శనివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో టీఎస్‌హెచ్‌డిసి చైర్మెన్ చింతా ప్రభాకర్ పాల్గొని.. పథాలజీ పరీక్షల అప్‌గ్రేడేషన్ పరికరాలను ప్రారంభించారు. ఇందుకు సంబంధించిన పట్టికను ఆవిష్కరించారు. రోగులకు పరీక్షలు నిర్వహించిన పరీక్షా ఫలితాల నివేదిక అందజేశారు. ఈ సందర్భంగా చింత ప్రభాకర్ మాట్లాడుతూ.. స్వాతంత్ర్యం వచ్చిన తరువాత నుంచి ఇప్పటి వరకు తెలంగాణలో ఉన్న వైద్య సదుపాయాలు ఎక్కడా లేవన్నారు. తెలంగాణ వైద్య ఆరోగ్య శాఖ దేశానికే ఆదర్శమన్నారు. హైదరాబాద్ ఆస్పత్రిలో అందే సేవలు మారుమూల ప్రాంత ఆసుపత్రిలో అందించాలన్నదే కేసీఆర్ లక్ష్యమన్నారు. 134 పరీక్షలు ప్రారంభించడం ద్వారా పేదలకు ప్రభుత్వ ఆసుపత్రిపై నమ్మకం పెరుగుతుందన్నారు. ఖర్చులకు భయ పడి పరీక్షలు వాయిదా వేసుకుంటే ప్రాణాలకే ప్రమాదమన్నారు. పైసా ఖర్చు లేకుండా మారుమూల ప్రాంతాల ప్రజలకు 134 పరీక్షల సదుపాయం తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ వాణి, ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెంట్ అనిల్, మున్సిపల్ చైర్‌పర్సన్ బొంగుల విజయలక్ష్మి, సీడీసీ చైర్మెన్ కాసాల బుచ్చిరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మెన్ ప్రభుగౌడ్, పట్టణ అధ్యక్షులు ఆర్ వెంకటేశ్వర్లు, కార్యదర్శి నర్సింలు, కౌన్సిలర్ అశోక్ కుమార్, మల్లేష్ వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధిలో దేశానికి దిక్సూచిగా తెలంగాణ



నవతెలంగాణ-పటాన్‌చెరు

ముఖ్యమంత్రి కేసీఆర్ సారథ్యంలో రాష్ట్రం దేశానికి దిక్సూచిగా మారి.. అభివృద్ధిలో పరుగులు పెడుతున్నదని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు నీలం మధు ముదిరాజ్ అన్నారు. 15 ఎంఎల్‌డి కెపాసిటీ ఎస్‌టిపి ప్రారంభోత్స వానికి శనివారం కోకాపేట్ వచ్చిన మున్సిపల్ ఐటీ శాఖ మంత్రి కేటీఆర్‌ను నీలం మధు మర్యాదపూర్వకంగా కలిసి పుష్ప గుచ్ఛం అందజేశారు. అనంతరం చిట్కుల్‌లో మధు మాట్లాడుతూ.. రాష్ట్రాన్ని 9ఏండ్లు పాలించి ఎంతో అభివృ ద్ధిలోకి తీసుకొచ్చిన ముఖ్యమంత్రి కేసీఆర్‌కు ముచ్చటగా మూడో సారి అధికారాన్ని కట్టబెట్టేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. గ్రామ గ్రామాన సంక్షేమ పథకాలతో బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజల గుండెల్లో నిలిచిపోయిందన్నారు. మంత్రి కేటీఆర్ దేశ విదేశాల్లో సైతం తిరుగుతూ స్వరాష్ట్రానికి నూతన పరిశ్రమలు తీసుకొచ్చి.. రాష్ట్రంలో పరిశ్రమల అభివృద్ధికి కృషి చేస్తున్నారన్నారు. తాను కూడా నియోజకవర్గం ప్రజలకు ఎప్పుడు అందుబాటులో ఉంటూ నియోజకవర్గ అభివృద్ధి ధ్యేయంగా ముందుకు వెళ్తున్నట్లు చెప్పారు.

హర్టెక్స్ యజమాన్యం మొండి వైఖరి వీడాలి

నవతెలంగాణ-ఐడిఏబొల్లారం



హర్టెక్స్ యాజమాన్యం మొండి వైఖరి వీడి.. పరిశ్రమలో వెంటనే ఉత్పత్తులను ప్రారంభించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు కే.రాజయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం పరిశ్రమ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రాజయ్య మాట్లాడుతూ.. ఎటువంటి ప్రభుత్వ అనుమతి లేకుండా.. ఉత్పత్తిని నిలిపేయడం కార్మిక చట్టాలకు విరుద్ధమన్నారు. అలాగే పరిశ్రమలో వేతన ఒప్పందం చేయాలని అడిగినందుకు 12 మంది కార్మిక నాయకులను సస్పెండ్ చేయడం దుర్మార్గమన్నారు. కార్మికులపై సస్పెన్స్ వెంటనే ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా రెండు నెలల జీతం ఇప్పటిదాకా చెల్లిం చకపోవడం బాధాకరమని.. వెంటనే వేతనాలు చెల్లించా లన్నారు. స్టాఫ్ వాళ్లకు వేతనాలు చెల్లించి కార్మికులకు చెల్లిం చకపోవడం కార్మిక చట్టలకు విరుద్ధం అన్నారు. యజమాన్యం వేతన ఒప్పందం చేయకుండా కాలయాపన చేస్తోందన్నారు. ఏండ్లు గడుస్తున్నా ఎందుకు వేతనం ఒప్పందం చేయట్లేదని ప్రశ్నించారు. కార్మికుల సమస్యలన్నీ పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేని యెడల ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు భాస్కర్‌రెడ్డి, శ్రీధర్‌రావు, మధుసూదన్‌రెడ్డి, సత్తయ్య, శేఖర్, సురేందర్‌రెడ్డి, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

డ్రయినేజీ సమస్యను పరిష్కరిస్తాం



నవతెలంగాణ-రామచంద్రాపురం

రామచంద్రాపురం డివిజన్‌లోని రామచంద్రారెడ్డి నగర్ కాలనీలో ఉన్న డ్రయినేజీ సమస్యను పరిష్కరిస్తానని కార్పొరేటర్ పుష్ప నగేష్ అన్నారు. కార్పొరేటర్ జలమండలి డీజీఎం శివకృష్ణ, మేనేజర్ జనార్దన్‌తో కలిసి సమస్య ఉన్న ప్రదేశంలో శనివారం పర్యటించారు. నూతన పైప్‌లైన్ కొరకు ప్రతిపాదన పూర్తి చేయాలని అధికారులను కార్పొరేటర్ ఆదేశించారు. ఎప్పటి నుంచో రామచంద్రారెడ్డి కమ్యూనిటీ హాల్ ముందు ఉన్న రోడ్ విస్తరణ చేయాలని కాలనీ వాసులు తెలుపడంతో సుమారు రూ.27 లక్షలతో సీసీరోడ్డు పనులను త్వరలో ప్రారంభిస్తామన్నారు. వారితో కాలనీ అధ్యక్షులు చంద్రశేఖర్ గుప్త నాయకులు కుమార్ గౌడ్, జగన్నాథ్ రెడ్డి, వాసుదేవ్, రాజి రెడ్డి, రమేష్, తిరుమల గౌడ్, సహదేవ్ గౌడ్, వెంకటరెడ్డి, సీఎం మల్లేష్, కుమ్మరి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

వైద్య వృత్తి ఆదర్శప్రాయం

నవతెలంగాణ-సదాశివపేట



ప్రానాలను కాపాడే వైద్య వృత్తి ఎంతో ఆదర్శప్రాయమని తెలంగాణ మంజీరా రైతు సమైక్య రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మలపల్లి పృథ్వీరాజ్ అన్నారు. శనివారం ప్రపంచ డాక్టర్ దినోత్సవాన్ని పురస్కరించుకొని.. అలాగే పృథ్వీరాజ్ పుట్టినరోజు సందర్భంగా స్థానిక బసవ సేవా సదన్‌లో పలువురు డాక్టర్లను శాలువా, పూలదండలతో సన్మానించారు. డాక్టర్ కిషోర్ కుమార్, డాక్టర్ చంద్ర శేఖర్ డాక్టర్, మాణిక్‌రాజ్, డాక్టర్ శరము, డాక్టర్ సంతోష్, డాక్టర్ సత్యంనారాయణ, డాక్టర్ అనిల్, డాక్టర్ హితేంద్ర, డాక్ట ర్ నిహారిక, డాక్టర్ నవ్య, డాక్టర్ నితిన్, డాక్టర్ సంగమణి, డాక్టర్ వంశీ, డాక్టర్ నితిన్, డాక్టర్ సూక్ష్మలను సన్మానించారు. ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షురాలు పురం రజిని కృపాకర్‌లు డాక్టర్లకు చిన్న జ్ఞాపికను అందజేశారు. అనంతరం పృథ్వీరాజ్ మాట్లాడుతూ.. ప్రమాదంలో ఉన్న వారి ప్రాణాలను కాపాడే వైద్య వృత్తి ఎంతో గౌరవప్రదమైందన్నారు. అలాంటి డాక్టర్లను రైతు సంఘం ద్వారా సన్మానించడం సంతోషకరమన్నారు. ఈ కార్యక్రమంలో సమైక్య సభ్యులు రవీందర్, జైపాల్ సంగిశెట్టి, వెంకటరావు, మహేష్, సంగమేశ్వర్ జ్ఞానోబా పూర్వ విద్యార్థులు గంట శివయ్య, వీరేశం, శంకర్, శివానంద్, శేఖర్ వీరశైవ లింగాయత్ ప్రధాన కార్యదర్శి మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ



నవతెలంగాణ-జహీరాబాద్

డాక్టర్ డే సందర్భంగా జహీరాబాద్ పట్టణంలోని భారత్‌నగర్‌లో గల జిల్లా పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో శనివారం పాఠ్య పుస్త కాలను అందించారు. పాఠశాల అధ్యాపకులకు షుగర్ పరీక్షలు నిర్వహించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షులు డాక్టర్ నాగరాజ్ పాటిల్ మాట్లాడుతూ.. మారుమూల ప్రాంతాల్లోని విద్యార్థుల సంక్షేమానికి తమ క్లబ్ కృషి చేస్తున్నదన్నారు. ఇప్పటికే పలు గ్రామాల్లో నీటిశుద్ధి యంత్రాలను పంపిణీ చేశామన్నారు. పలు పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించామ న్నారు. భారత్‌నగర్‌లోని విద్యార్థులకు పాఠ్యపుస్తకాలతో పాటు వైద్య పరీక్షలు నిర్వహించాలన్నదే తమ లక్ష్యమన్నారు. విద్యార్థులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఆహార నియమ నిబంధనల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రాజేశ్వర్ రెడ్డి, డాక్టర్ సోహెల్, డాక్టర్ రాజశేఖర్, డాక్టర్ సతీష్ లతోపాటు శ్రీకాంత్ పాటిల్, శ్రీకాంత్ షట్కార్, సీపీఐ జిల్లా నాయకులు జలాలుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

జోగిపేట గుమస్తా సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక

నవతెలంగాణ-జోగిపేట



శంకరయ్య



మహేష్ యాదవ్

జోగిపేట గుమస్తా సంఘం నూతన కార్యవర్గాన్ని శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా డాకూరి శంకరయ్య, ప్రధాన కార్యదర్శిగా ఎర్రగోళ్ల మహేష్ యాదవ్, కోశాధికారిగా కె.నర్సింలు, ఉపాధ్యక్షుడిగా నవాజ్, దుర్గయ్య, కార్యవర్గ సభ్యులుగా ఎం.లక్ష్మణ్, కే. రాములు, ఎం. నాగ రాజు, ఆనంద్, జి.మల్లేశం, జి. కృష్ణ, కే. బలరాం . ఏ. మల్లేశం, లక్ష్మయ్యలను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సంఘం బలోపేతానికి తామందరం కృషి చేస్తామన్నారు. గుమస్తా సంఘం సభ్యుల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించి వారికి తగిన న్యాయం చేస్తామ న్నారు. నూతన పాలకవర్గానికి ప్రతీ ఒక్కరు సహకరిం చాలని, సలహాలు సూచనలు చెప్పాలన్నారు.



ప్రభుత్వ ఆసుపత్రిలో ఘనంగా డాక్టర్స్ డే

- కేక్ కట్ చేసిన ఆసుపత్రి సూపరింటెండెంట్



నవతెలంగాణ-మెదక్
మెదక్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో శనివారం జాతీయ వైద్యుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి సూపరింటెండెంట్ పి.చంద్రశేఖర్, వైద్యులు కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం మాట్లాడుతూ.. వైద్యులను ప్రత్యక్ష దైవంగా ప్రజలు భావిస్తారని, వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా వైద్య వృత్తిని అంకిత భావంతో నిర్వహించాల్సిన అవసరం ఉందని సూచించారు. కరోనా మహమ్మారి లాంటి విపత్కర పరిస్థితుల్లో ప్రాణాలను లెక్కచేయకుండా వైద్యులు సేవలందించారని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో వైద్యులు ఏ. చంద్రశేఖర్, కిరణ్, సిబ్బంది తదితరులు ఉన్నారు.

జీపీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

- 6న జిపి కార్మికుల సమ్మె నోటీస్ అందజేత
- సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఏ మల్లేశం



నవతెలంగాణ-వెల్దుర్తి : గ్రామపంచాయతీ సిబ్బందిని అందరిని పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 6న సమ్మె కొనసాగుతుందని సిఐటియు మెదక్ జిల్లా ఉపాధ్యక్షుడు మల్లేశం తెలిపారు. ముందస్తుగా శనివారం మండల కేంద్రంలో జిపి కార్మికులతో జనరల్ బాడీ సమావేశం ఏర్పాటు చేసి పలు డిమాండ్లతో కూడిన సమ్మె నోటీసును ఎంపీడీవో కార్యాలయంలో సిబ్బందికి సిఐటియు మెదక్ జిల్లా ఉపాధ్యక్షుడు మల్లేశం గ్రామపంచాయతీ కార్మికులతో కలిసి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గ్రామపంచాయతీ సిబ్బంది అందరిని పర్మినెంట్ చేయాలని పంచాయతీ కార్మికులకు జీవో నెంబర్ 60 ప్రకారం వేతనాలు పెంపు మల్టీపర్పస్ వర్కర్స్ విధానం రద్దు చేసి, కారోబార్ బిల్ కలెక్టర్లను సహాయ కార్యదర్శిగా నియమించాలని డిమాండ్ చేశారు. ఇతర సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 6న సమ్మె కొనసాగుతుందని మండల వ్యాప్తంగా ఉన్న జిపి కార్మికులు సమ్మెలో పాల్గొని విజయవంతం చేయాలని మల్లేశం కోరారు.

రేగోడు మండల లైన్స్ క్లబ్ అధ్యక్షునిగా గంజి సంగమేశ్వర పాటిల్

నవతెలంగాణ-రేగోడు
రేగోడు మండలం లైన్స్ క్లబ్ నూతన అధ్యక్షునిగా కొండపూర్ గ్రామానికి చెందిన గంజి సంగమేశ్వర్ పాటిల్ ను, సెక్రటరీగా చోటు బాయ్‌ను, లైన్ ట్రెజరీగా జయరాజును లైన్స్ క్లబ్ సభ్యులు శనివారం ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో రీజనల్ చైర్మన్ దిగంబర రావు, జోనల్ చైర్మన్ యాదగిరి, లైన్స్ క్లబ్ సభ్యులు నాగిరెడ్డి, గాండ్ల నర్సింలు, శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అనంతరం స్కూల్ పిల్లలకు బిస్కెట్లు ప్యాకెట్లు పంపిణీ చేశారు..

ఎంఎస్ఎస్ఓ ఆధ్వర్యంలో బోరు



నవతెలంగాణ-నిజాంపేట
మైనంపల్లి సోషల్ సర్వీస్ ఆర్గనైజేషన్ చైర్మన్ మైనంపల్లి రోహిత్ సహకారంతో నిజాంపేట మండల కేంద్రంలోని తెలంగాణ తల్లి విగ్రహం వద్ద ఒకటి, మాహంకాలమ్మ గుడి దగ్గరముదిరాజ్ సంఘానికి బోరు వేయడం జరిగింది. బీఆర్ఎస్ కార్యకర్తలు మైనంపల్లి వర్గం వెల్దుర్తి వెంకటేష్ గౌడ్, జాల శ్రీకాంత్ మాట్లాడుతూ నిజాంపేట మండలంలో నీటి ఎద్దడి ఎక్కడున్నా అక్కడ బోర్ వేయడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. బోర్లు వేయడమే కాకుండా వాటికి మోటర్లు కూడా బిగిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పంజా శ్రీనివాస్ , పంజా బాబు, దండు సిద్ద రాములు , సత్తయ్య, పోచయ్య ,వెంకటస్వామి, దేవుని రాజు ,అంజయ్య ,పున్న స్వామి ,పంచ సత్తయ్య, బోగయ్య , తదితరులు పాల్గొన్నారు,

రామకోటి భక్త సమాజం ఆధ్వర్యంలో తలంబ్రాల పంపిణీ



నవతెలంగాణ -గజ్వేల్
భద్రాచల దేవస్థానం వారి ముత్యాల తలంబ్రాలను శ్రీరామకోటి భక్త సమాజం ఆధ్వర్యంలో శనివారం భక్తులకు పంపిణీ చేశారు. గజ్వేల్ మండలం బంగ్లావెంకటపూరు గ్రామంలో హనుమాన్ దేవాలయం వద్ద భజన కార్యక్రమాలు నిర్వహించి భక్తులందరికి సంస్థ అధ్యక్షులు రామకోటి రామరాజు తలంబ్రాలు అందజేశారు. ఈ సందర్భంగా రామకోటి రామరాజు మాట్లాడుతూ ప్రపంచంలో అన్ని నశిస్తాయి, కాని భక్తి నశించదని, భక్తి శాశ్వతమైనదన్నారు. రామ నామం ఒక్కటే అన్నారు. భద్రాచల తలంబ్రాలు లభించడం మన అదృష్టమన్నారు. ఈ కార్యక్రమంలో పాశం బాపురెడ్డి, బాకి నర్సింహులు, పాశం రాజేశ్వర్ రెడ్డి, పంజాల రవీందర్ గౌడ్, వర్కటం వెంకటేష్ యాదవ్, పిట్ల లక్ష్మయ్య, చీమలదారి కుమార్ గౌడ్ పాల్గొన్నారు.

విద్యాత్‌ఘాతంతో జెర్సీ ఆవు మృతి



నవతెలంగాణ- నంగునూరు
గడ్డి మేస్తున్న జెర్సీ ఆవు విద్యుత్ ట్రాన్స్ఫార్మర్‌కు తగిలి అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన శనివారం నంగునూరు మండలం పాలమాకుల గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన కవ్వం శ్రీనివాస్ రెడ్డి రోజు మాదిరిగానే చూడితో ఉన్న తన ఆవును మేతకు వదిలాడు. గడ్డి మేస్తున్న క్రమంలో సమీపంలో ఉన్న ట్రాన్స్ఫార్మర్‌కు తగిలి విద్యుత్‌ఘాతంలో అక్కడికక్కడే మృతి చెందింది. ఇది చూసిన రైతులు విద్యుత్ అధికారులకు సమాచారం అందించడంతో కరంటు సరఫరా నిలిపివేశారు. పశువైద్య సిబ్బంది అక్కడికి చేరుకొని పంచనామా నిర్వహించారు. చూడితో ఉన్న ఆవు మృతి చెందడంతో సుమారు 50 వేల నష్టం వాటిల్లిందని బాధిత రైతు శ్రీనివాస్ రెడ్డి తెలిపారు.

మహంకాళి అమ్మవారిని దర్శించుకున్న ప్రత్యేక అధికారి ముత్యంరెడ్డి



నవతెలంగాణ- గజ్వేల్
ఎంతో మహిమా న్విత దేవాలయం గజ్వేల్ మహంకాళి దేవాల యమని గజ్వేల్ స్పెషల్ అధికారి ముత్యం రెడ్డి, గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్మన్ రాజమౌళి అన్నారు. గజ్వేల్‌లోని మహంకాళి అమ్మవారి దేవాలయంలో శనివారం అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అషాడ బోనాల ఉత్సవాలలో భాగంగా మహంకాళి దేవాలయంలో విశేష పూజలు హెూమం నిర్వహించి భక్తులకు అన్నదానం కార్యక్రమం నిర్వహించామన్నారు. అమ్మవారికి ఆదివారం బోనాలు సమర్పించే కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని మహంకాళి అమ్మవారి కృప కటాక్షాలు పొందాలన్నారు. నిష్టతో అమ్మవారికి బోనం సమర్పిస్తే అంతా శుభం కలుగుతుందన్నారు. మహంకాళి అమ్మవారి ఆశీర్వాదంతో అందరూ బాగుండాలని కోరుకోవడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ విద్యాధర్, కౌన్సిలర్స్ బొల్లిపల్లి బాలమణి శ్రీనివాస్ రెడ్డి, భాగ్యలక్ష్మి దుర్గా ప్రసాద్, చందన రవీందర్, శీర్ల శ్యామల మల్లేష్ యాదవ్, బాలేష్, ఆలయ పూజారి నందబాల శర్మ, ఆలయ చైర్మన్ కాల్వ శ్రీధర్, శంకరయ్య, సిద్దిపేట జిల్లా యువజన అధ్యక్షులు. సంతోష్ గుప్తా, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

శుక్రవారం వారసంతలో నిలువు దోపిడి



నవతెలంగాణ-హుస్నాబాద్ రూరల్
హుస్నాబాద్ పట్టణంలో ప్రతి శుక్రవారం జరిగే వారసంతలో కాంట్రాక్ట ర్ నిలువు దోపిడీకి పాల్పడుతున్నారని ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ నియోజకవర్గ కన్వీనర్ పచ్చిమట్ల రవీందర్ గౌడ్ ఆరోపించారు. వారసంతలో ధరల పట్టిక ఫ్లెక్సీ ఏర్పాటు చేయకుండా అక్రమాలకు పాల్పడుతున్నారన్నారు. హుస్నాబాద్ మున్సిపాలిటీ పరిధిలో ఎంతో పేరున్న అంగడిలో మున్సిపల్ నిర్ణయించిన ధరలకంటే డబల్ వసూలు చేస్తున్నారని తెలిపారు. రైతుల వద్ద, హెూటల్ వద్ద, చిన్నచిన్న పనిముట్లు అమ్ముకునే వారి వద్ద, పార్కింగ్ పేరిట వాహనాల నుంచి రెట్టింపు వసూలు చేయడం జరుగు తుందన్ననారు. కాంట్రాక్టర్ పై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.

ఖో-ఖో విజేతలకు బహుమతులను ప్రధానం



నవతెలంగాణ -గజ్వేల్
అంతర్జాతీయ ఖో-ఖో దినోత్సవాన్ని పురస్కరించుకొని సిద్దిపేట్ జిల్లా స్థాయి ఖో-ఖో టోర్నమెంట్‌ను గజ్వేల్ ఖో-ఖో క్లబ్ క్రీడాజ్యోతి సౌజన్యంతో గజ్వేల్‌లోని ఐఓసి గ్రౌండ్‌లో శనివారం నిర్వహించారు. బాలికల విభాగంలో 26 జట్లు, బాలుర విభాగంలో 24 జట్లు పాల్గొన్న ఈ జిల్లా స్థాయి క్రీడా పోటీలలో విజేతలుగా నిలిచిన జట్లకు నగదు బహుమతితో పాటు మెమెంటోలను చైర్మన్ వంటేరు ప్రతాప్ రెడ్డి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ డాక్టర్ యాదవ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ రాజమౌళి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్ జి ఎఫ్ సెక్రటరీ రామేశ్వర్ రెడ్డి, గజ్వేల్ నియోజకవర్గ బాధ్యులు ఎలేశ్వరరావు, ఖో-ఖో అసోసియేషన్ ఉపాధ్యక్షులు రవికుమార్, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు, పీఈటీలు రాజిరెడ్డి, విజయరేఖ గోవర్ధన్, నరేష్ ప్రైవేట్ పిఈటిలు రమేష్, మురళి, లైన్స్ క్లబ్ ప్రెసిడెంట్ మతిన్ తదితరులు పాల్గొన్నారు.

ధరల పట్టికలు లేవు స్టాకు బోర్డులు లేవు

- అదును చూసి రైతులను నిలువు దోపిడీ చేస్తున్న ఫర్టిలైజర్ దుకాణదారులు



నవతెలంగాణ-నిజాంపేట
వానాకాలం వర్షాలు దాదాపు కురుస్తున్నాయి. రైతులు వ్యవసాయ పనుల్లో నిమగ్నమై దుక్కులు దున్నుతూ విత్తనాలను, ఎరువులను కొనుగోలు చేస్తున్నారు. నిజాంపేట మండల కేంద్రంలో దాదాపు 8 ఫర్టిలైజర్ దుకాణాలు ఉన్నప్పటికీ ధరల పట్టికలు స్టాక్ బోర్డులు పెట్టడం లేదని మండల రైతులు ఆరోపిస్తున్నారు. అమాయక రైతులను చూసి ఫర్టిలైజర్ దుకాణ యజమానులు అధిక ధరలకు అమ్ముతున్నారని రైతులు పేర్కొన్నారు. వ్యవసాయ అధికారులు కూడా చూసీ చూడనట్లు వ్యవహరిస్తూ, తూతూ మంత్రంగా తనిఖీలు చేస్తూ ఫర్టిలైజర్ దుకాణ యజమానులకు మద్దతుగా నిలుస్తూ రైతులకు సరైన న్యాయం చేయడం లేదని మండల రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రైతులకు న్యాయం చేయాల్సిన అధికారులే పట్టించుకోకుంటే రైతుల గతి ఏమి కావాలంటూ రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మండల వ్యవసాయ అధికారులకు, జిల్లా స్థాయి అధికారులకు ఎన్నిసార్లు విన్నవించుకున్నా సరైన స్పందన లేదని రైతులు వాపోతున్నారు. ఇప్పటికైనా జిల్లా వ్యవసాయ అధికారులు కలెక్టర్ స్పందించి ప్రతి ఫర్టిలైజర్ దుకాణాలలో ధరల పట్టికలు స్టాక్ బోర్డులు ఏర్పాటు చేసేలా తగిన చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.



ధరల పట్టికలు లేకపోతే చర్యలు

గతంలో ఫర్టిలైజర్ దుకాణాలను తనిఖీ చేయడం జరిగిందని అప్పుడు షాపు యజమానులకు చెప్పడం కూడా జరిగిందని, ఒకవేళ ఇప్పుడు ధరల పట్టికలు స్టాక్ బోర్డులు లేనట్లయితే కఠిన చర్యలు తీసుకుంటాం

సతీష్, మండల వ్యవసాయ అధికారి

ధరల పట్టికలు స్టాక్ బోర్డులు వెంటనే ఏర్పాటు చేయాలి



ఫర్టిలైజర్ దుకాణ యజమానులు ఎరువులకు, పెస్టిసైడ్ మందులకు, ఏ ధర చెప్పిన అదే ధర ప్రకారము చెల్లించాల్సిన పరిస్థితి ఏర్పడిందని ధరల పట్టికలు స్టాక్ బోర్డులు ఉన్నట్లయితే రైతులు వాటి ప్రకారం డబ్బులు చెల్లిస్తారు. ధరల పట్టికలు స్టాక్ బోర్డులు లేక రైతులు ఎంతో నష్టపోతున్నారని ఇదే అదునుగా చూసి ఫైటిలైజర్ దుకాణ యజమానులు ఇష్టం వచ్చిన రీతిలో దోచుకుంటున్నారని సంబంధిత జిల్లా అధికారులు స్పందించి ఫర్టిలైజర్ దుకాణాలపై తగు చర్యలు తీసుకొని ధరల పట్టికలను స్టాక్ బోర్డులను ఏర్పాటు చేసి మెయింటెనెన్స్ చేసేలా తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నాను.

కన్నాపురం బాగా గౌడు , రైతు, నిజాంపేట

పేదల ఆరోగ్యంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి

- జిల్లా ఆసుపత్రిలో 134 రకాల ఉచిత రక్త పరీక్షలు
- ప్రజలకు అందుబాటులో టిడయాగ్నస్టిక్ హబ్
- మెదక్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్ రెడ్డి





నవతెలంగాణ-మెదక్
పేదల ఆరోగ్యం విషయంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తుందని మెదక్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం జాతీయ వైద్య దినోత్సవాన్ని పురస్కరించుకుని మెదక్ జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో హెల్త్ డయాగ్నస్టిక్ సెంటర్‌లో 134 రకాల వ్యాధి నిర్ధారణ పరీక్షలు, అత్యాధునిక యంత్రాలను అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్, డిఎంహెచ్ఓ డాక్టర్ చందూనాయక్, మున్సిపల్ చైర్మన్ చంద్రపాల్, జెడ్పీ వైస్ చైర్మన్ లావణ్యరెడ్డి, డిసిహెచ్ డా. చంద్ర శేఖర్‌లతో కలిసి ప్రారంభించారు. అనంతరం రాష్ట్ర వ్యాప్తంగా ఆరోగ్యశాఖ మంత్రి హరీశ్ రావు హైదరాబాద్ నుంచి జూమ్ మీటింగులో అన్ని జిల్లాల ఎమ్మెల్యేలు, కలెక్టర్లు, జెడ్పీ చైర్మన్లతో మాట్లాడారు. పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే ఉద్దేశ్యంతో తెలంగాణ ప్రభుత్వం ముందుకెళ్తున్నట్లు తెలిపారు. గర్భిణీలకు అన్ని రకాల సేవలను ప్రభుత్వ ఆసుపత్రిలోనే ఉచితంగా నిర్వహించబడుతాయని తెలిపారు. ఇటీవల ప్రారంభించిన న్యూట్రిషన్ కిట్ అందుతుందా లేదా అని చూడాలని సూచించారు. ప్రతి మంగళవారం ఆరోగ్య మహిళ కేంద్రాన్ని పర్యవేక్షణ చేయాలని అధికారులకు, ప్రజాప్రతినిధులకు సూచించారు. జిల్లాలోని ప్రతి పీహెచ్సీకి ఓపి ఎంత వస్తుందని తెలుసుకోవాలని, సీజనల్ వ్యాదుల పట్ల ప్రత్యేక దృష్టి సారించాలని వైద్యులకు సూచించారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా కేవలం తెలంగాణలోనే ఇన్ని రకాల వైద్య సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. మెదక్ లో మెడికల్ కళాశాలను త్వరలోనే ఏర్పాటుచేస్తామని మంత్రి హరీశ్ రావు స్పష్టం చేశారు. అనంతరం ఎమ్మెల్యే పద్మాదేవేందర్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పేదల ఆరోగ్యం విషయంలో ఆలోచించి టిడయాగ్నొస్టిక్ సెంటర్లలో అందుబాటులో ఉన్న 57 రకాల వ్యాధి నిర్ధారణ పరీక్షల సంఖ్యను 134 రకాల వరకు పెంచడం పేద ప్రజలకు చాలా ఉపయోగకరమన్నారు. పేదలు అనారోగ్యాల బారిన పడితే ప్రైవేట్ ఆస్పత్రికి వెళ్లాల్సిన అవసరం లేదని, అన్ని రకాల పరీక్షలు ప్రభుత్వ ఆసుపత్రిలో ఉచితంగా చేసుకోవచ్చుని తెలిపారు. జిల్లా ప్రజలు ఉచిత పరీక్షలు చేయించుకుని వ్యాధి నివారణ చికిత్సలు చేసుకొని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. ఆరోగ్యవంతమైన తెలంగాణే ధ్యేయంగా సీఎం కేసీఆర్ ముందుకెళుతున్నట్లు తెలిపారు. అనంతరం జాతీయ వైద్య దినోత్సవం సందర్భంగా కేక్ కట్ చేసి, స్థానిక వైద్యులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు ఏ. చంద్రశేఖర్, కిరణ్ రెడ్డి, కౌన్సిలర్లు రాగి వనజ అశోక్, శ్రీనివాస్, రాజు, ఆత్మ కమిటీ చైర్మన్ అంజాగౌడ్, పీఏసీఎస్ చైర్మన్ హన్మంత్ రెడ్డి, కోఆప్షన్ మెంబర్ ఉమ్మర్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు గంగాధర్, గూడూరి అరవింద్ గౌడ్, బాని తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా గ్రూప్ 4 పరీక్ష

- కేంద్రాలను పర్యవేక్షించిన కలెక్టర్, ఎస్పి
- ఆలస్యంగా వచ్చిన విద్యార్థులను అనుమతించని నిర్వాహకులు













నవతెలంగాణ-మెదక్
మెదక్ జిల్లా వ్యాప్తంగా శనివారం జరిగిన గ్రూప్-4 వ్రాత పరీక్ష ప్రశాంత వాతావరణంలో జరిగాయి. జిల్లాలో మొత్తం 30 పరీక్ష కేంద్రాల దగ్గర పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. ఉదయం 11257 మందికిగాను 9707 మంది హాజరుకాగా, 1550 మంది గైర్హాజరయ్యారు. అలాగే మధ్యాహ్నం సెషన్లో 11257 మందికిగాను, 9695 మంది హాజరుకాగా 1562 మంది గైర్హాజరయ్యారు. జిల్లా ఎస్పి రోహిణి ప్రియదర్శిని, కలెక్టర్ రాజర్షి షా పరీక్ష కేంద్రాలను పర్యవేక్షించారు. పరీక్ష కేంద్రాల వద్ద మెదక్, తూప్రాన్ డీఎస్పీలు సైదులు, యాదగిరి రెడ్డి, సిఐలు, ఎస్ఐల ఆధ్వర్యంలో పరీక్షలు సజావుగా జరిగాయి.

నవ తెలంగాణ నర్సాపూర్ : నర్సాపూర్‌లో నిర్వహించిన గ్రూప్ 4 పరీక్షలు శనివారం ప్రశాంతంగా జరిగాయి . గ్రూప్ 4 పరీక్షల కోసం నర్సాపూర్ పట్టణంలో 8 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. మొత్తం 3169 మంది అభ్యర్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా. 2680 మంది మాత్రమే పరీక్షలకు హాజరయ్యారు. 489 మంది అభ్యర్థులు గైరాజరైనట్లు అధికారులు తెలిపారు. బివిఆర్ఐటిలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాన్ని కలెక్టర్ రాజర్షి షా, ఎస్పీ రోహిణి ప్రియదర్శిని, అదనపు కలెక్టర్ రమేష్‌లు ఆకస్మికంగా తనిఖీ చేసి పరిశీలించారు. పరీక్ష కేంద్రాల నిర్వాహకులను అభ్యర్థుల హాజరు వివరాలను అడిగి తెలుసుకున్నారు. వీరి వెంట ఆర్డిఓ శ్రీనివాసులు ఉన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటనలో చోటు చేసుకోకుండా సీఐ షేక్ లాల్ మదార్ ఆధ్వర్యంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

నవ తెలంగాణ-సిద్దిపేట : శనివారం జిల్లాలో నిర్వహించిన గ్రూప్-4 రాత పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. పరీక్ష సమయానికి రెండు గంటల ముందుగానే అభ్యర్థులు తమ తమ పరీక్ష కేంద్రాల వద్దకు చేరుకున్నారు. ఉదయం 8 గంటల నుంచే అభ్యర్థులను క్షుణంగా తనిఖీ చేసి పరీక్ష కేంద్రాలలోకి అనుమతించారు. పరీక్ష కేంద్రాలలోకి హ్యాండ్ బ్యాగులు, పర్సులు, వాచ్ లు, స్మార్టు ఫోన్లు అనుమతించలేదు. షూ వేసుకుని వచ్చిన వారిని షూ బయట విప్పిన తర్వాతనే లోనికి అనుమతించారు. పరీక్షా సమయానికి 15 నిమిషాల ముందుగానే పరీక్ష కేంద్రాల గేట్లను మూసి వేశారు. దీంతో పలు సెంటర్లలో ఆలస్యంగా వచ్చిన పలువురు అభ్యర్థులు వెనుదిరిగిపోయినట్లు తెలిసింది. 80 పరీక్షా కేంద్రాలలో 25,978 మంది అభ్యర్థులను కేటాయించారు. మొదటి పేపర్ పరీక్షకు 21,838, మంది అభ్యర్థులు హాజరు కాగా, 4,140 మంది గైరాజరయ్యారని అధికారులు తెలిపారు. రెండో పేపర్‌కు సైతం 25,978 మంది హాజరు కావాల్సి ఉండగా 21 ,744 మంది హాజరు కాగా 4,234 మంది గైరాజరయ్యారు. పరీక్ష కేంద్రాల వద్ద పోలీసు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6 గంటల 144 సెక్షన్ విధించారు. పరీక్ష కేంద్రాల సమీపంలో ఉన్న అన్ని జిరాక్స్ సెంటర్స్, ఇంటర్ నెట్ సెంటర్స్, చుట్టు పక్కల లౌడ్ స్పీకర్లు మూసి వేయించారు. ఆర్టీసీ అధికారులు ప్రత్యేక బస్సులను వివిధ సెంటర్లకు ఏర్పాటు చేశారు. జిల్లాలో గ్రూప్-4 పరీక్ష ప్రశాంతంగా ముగియడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు.

నవతెలంగాణ-కొండపాక : టీఎస్‌పీఎస్‌సి నిర్వహించిన గ్రూప్ 4 పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. కొండపాక, కుకునూరుపల్లి మండలాల్లోని ఆరు కేంద్రాల్లో అభ్యర్థులు పరీక్షలు రాశారు. ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నారు. కుకునూరుపల్లిలో ఉన్నత పాఠశాల, తిమ్మారెడ్డిపల్లిలోని వినాయక కళాశాల, కొండపాక మోడల్ స్కూల్, వేద ఇంటర్నేషనల్ స్కూల్, వెలికట్ట ఫార్మసీ కళాశాల, దుద్దెడ ఉన్నత పాఠశాలలో అభ్యర్థులు పరీక్షలు రాశారు. చిన్న పిల్లలను తీసుకొని వచ్చిన అభ్యర్థులు వారి పాలన పాలనను పరీక్షలు రాసే వారి బంధువులు చూసుకున్నారు. వేద ఇంటర్నేషనల్ స్కూల్ వద్ద చిన్న పాపను ఏఎస్ఐ సువర్ణ ఎత్తుకొని పరీక్ష అయ్యేంతవరకు ఆలన పాలన చూశారు.

నవతెలంగాణ-చేర్యాల: గ్రూప్4 పరీక్షలను అధికారులు, పోలీసుల సమన్వయంతో శనివారం ప్రశాంతంగా నిర్వహించారు. పరీక్ష కేంద్రాల వద్ద పోలీసులు కట్టు దిట్టమైన భద్రత ఏర్పాటు చేసి పరీక్షకు 15 నిమిషాల ముందు వచ్చిన విద్యార్థులను పరీక్ష రాయడానికి అనుమతించారు. చేర్యాల మండల కేంద్రంతోపాటు మండల పరిధిలోని ముస్త్యాల మోడల్ స్కూల్ లో ఐదు సెంటర్లను ఏర్పాటు చేశారు. ఈ సెంటర్లలో 1080 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కావాల్సి ఉండగా 882 మంది విద్యార్థులు మాత్రమే పరీక్షకు హాజరు కాగా 198 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. ఇందులో మండల కేంద్రంలోని సాధన కళాశాలలో ఇద్దరు విద్యార్థులు, ప్రతిభ డిగ్రీ కళాశాలలో ఒక విద్యార్థి పరీక్ష కేంద్రానికి ఆలస్యంగా రావడంతో పోలీసులు విద్యార్థులను వెనక్కి పంపారు. ఇందులో ఒకరు కొహెడ మండలం తంగళ్ళపల్లి గ్రామానికి చెందిన దొంతి మౌనిక 7 నిమిషాలు ఆలస్యంగా రాగా మరొకరు బూంపల్లి గ్రామానికి చెందిన లావణ్య అనే విద్యార్థి 12 నిమిషాలు ఆలస్యంగా వచ్చింది. విద్యార్థులు పోలీసులను ఎంత బ్రతిమిలాడినా పరీక్షకు అనుమతించక పోవడంతో కంట తడి పెడుతూ నిరాశగా వెనుదిరిగారు.

ప్రాజెక్టులోకి నీళ్లు సంబరాల్లో ప్రజలు





నవతెలంగాణ-అక్కన్నపేట
అక్కన్నపేట మండలం గౌరవెల్లి రిజర్వాయర్‌ను ఎమ్మెల్యే ఓడితల సతీష్ కుమార్ శనివారం సందర్శించారు. అనంతరం ఎమ్మెల్యే సతీష్ కుమార్ మైసమ్మ తల్లిని ప్రతిష్టాపన చేసి, గంగమ్మ తల్లికి బోనం సమర్పించి, బతుకమ్మలు ఎత్తుకొని పూజలు నిర్వహించారు. తదనంతరం ఏర్పాటుచేసిన కార్యక్రమానికి చుట్టుపక్కల గ్రామాల ప్రజలంతా స్వచ్ఛందంగా తండోపతండాలుగా తరలివచ్చి సంబరాలు చేసుకుంటూ నృత్యాలు చేశారు. అనంతరం సతీష్ కుమార్ మాట్లాడుతూ గౌరవెల్లి రిజర్వాయర్ అనేది దశాబ్దాల కల అని, కేసీఆర్ సహకారంతో ఈ కల నెరవేరిందన్నారు. దాదాపుగా 9 టీఎంసీల ఈ ప్రాజెక్టు ద్వారా లక్ష ఎకరాలకు పైగా నీరు అందుతుందని ఆకాంక్షించారు. ప్రాజెక్టు నిర్మాణం కోసం సహకరించిన నిర్వాసితులందరికీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మాలోతు లక్ష్మీ బిలునాయక్, జెడ్పిటిసి భూక్యా మంగ శ్రీనివాస్, మార్కెట్ కమిటీ చైర్మన్ ఎడబోయిన రజిని తిరుపతి రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు పెసరు సాంబరాజు, రేగొండ సర్పంచ్ మూల నిర్మల సూర్యరెడ్డి లతో, యూత్ నాయకులు, ఎంపీటీసీలు, సర్పంచులు, కార్యకర్తలు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

బీసీ బాయ్స్ కళాశాల హాస్టల్ విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలి

ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ఎర్రోళ్ల మహేష్



నవతెలంగాణ-సంగారెడ్డి
బీసీ బాయ్స్ కళాశాల హాస్టల్ విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ఎర్రోళ్ల మహేష్ అన్నారు. శనివారం సంగారెడ్డి జిల్లా కేంద్రంలో ఉన్న అంబేద్కర్ గ్రౌండ్ దగ్గరలో బీసీ కళాశాల హాస్టల్ సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ఎర్రోళ్ల మహేష్ మాట్లాడుతూ సమస్యల సుడిగుండంలో బీసీ హాస్టల్ నెలకొందన్నారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం పెట్టడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం పెంచిన మేస్ చార్జీలు వెంటనే అమలు చేస్తే విద్యార్థులకు మంచి భోజనం అందుతుందన్నారు. మెనూ ప్రకారం భోజనం పెట్టడం లేదన్నారు. విద్యార్థులను పట్టించుకోనే పరిస్థితి లేదన్నారు. విద్యార్థుల సమస్యలు పరిష్కరించకపోతే ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ టౌన్ నాయకులు సాయి చరణ్, ప్రభు, మహేందర్, రాజు,రాజేష్ ,వంశీ ,తరుణ్, తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

నవతెలంగాణ-పాపన్నపేట
విద్యుత్ ఘాతంతో గాయపడి చికిత్స పొందుతూ ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని శానాయిపల్లిలో చోటు చేసుకుంది...ఎస్ఐ విజయకుమార్ కథనం ప్రకారం గ్రామానికి చెందిన బనిగంటి కేశయ్య (57) వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. గత నెల 23న పొలం పనుల నిమిత్తం పొలం వద్దకు వెళ్ళాడు. అప్పటికే పొలంలో తెగిపడిన విద్యుత్ తీగకు సరఫరా లేదనుకొని పక్కకు జరిపేందుకు పట్టుకున్నాడు. తీగకు సరఫరా ఉండడంతో కేషయ్య చేతికి, శరీరానికి గాయాలు అయ్యాయి. అక్కడే ఉన్న స్థానికులు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. వారు వెంటనే అక్కడికి చేరుకుని చికిత్స నిమిత్తం మెదక్ ఏరియా ఆస్పత్రికి తరలింపు చేశారు. అక్కడ కొద్ది రోజుల చికిత్స అనంతరం అదే నెల 29న మెరుగైన చికిత్స నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం అర్ధరాత్రి సమయంలో మృతి చెందాడు. భార్య దుర్గవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు..

ప్రజలకు సుపారిపాలన అందించడమే లక్ష్యం

- ఇంటిగ్రేటెడ్ భవనాన్ని సందర్శించిన ఎమ్మెల్యే



నవతెలంగాణ-హుస్నాబాద్ రూరల్
రాష్ట్రంలో ప్రజలకు సూపరి పాలన అందించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తుందని హుస్నాబాద్ ఎమ్మెల్యే వోడితల సతీష్ కుమార్ అన్నారు. శనివారం కిషన్ నగర్ గ్రామంలో రూ.17 కోట్ల వ్యయంతో నిర్మించిన నూతన ఇంటిగ్రేటెడ్ భవనాన్ని ఎమ్మెల్యే సతీష్ కుమార్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సతీష్ కుమార్ మాట్లాడుతూ ఆగస్టు రెండోవ వారంలో ప్రారభించేందుకు సన్నాహాలు చేపడుతున్నామన్నారు. పరిపాలన సౌలభ్యం కోసం అనేక అభివృద్ధి కార్యక్రమాలు సీఎం కేసీఆర్ ప్రత్యేక చొరవ తీసుకుంటున్నారన్నారు. పరిపాలన వికేంద్రికరణతోనే పట్టణాలు అభివృద్ధి చెందుతున్నాయన్నారు. ప్రజలకు అందుబాటులో ఉండేలా అన్నీ ప్రభుత్వ కార్యాలయాలు ఒకే భవనంలో ఉండాలని ఇంటిగ్రేటెడ్ (సమీ కృత కార్యాలయ భవన సముదాయం) ఐఓసి భవనాన్ని నిర్మించడం జరిగిందని తెలిపారు. ఇంటిగ్రేటెడ్ భవనాన్ని ఆగస్టు రెండోవ వారంలో మంత్రి తన్నీరు హరీష్ రావు చేతుల మీదుగా ప్రారంభం జరుగుతుందన్నారు. భవనంలో ఆర్డీవో ఆఫీస్, ఎమ్మార్వో ఆఫీస్ హుస్నాబాద్, ఈఈ ఆఫీస్, ఆర్ అండ్ బి ఈఈ ఆఫీస్, నేషనల్ హైవే ఈఈ ఆఫీస్ ఉంటాయని అన్నారు. మున్సిపల్ చైర్మన్ ఆకుల రజిత వెంకన్న, ఎంపీపీ లకావత్ మానస సుభాష్, జెడ్పిటిసి భూక్య మంగ శ్రీనివాస్, అధికారులు తదితరులు పాల్గొన్నారు.



రసాయనిక ఎరువులు వాడకూడదు

నవ తెలంగాణ-సిద్దిపేట

రైతులు పంటలకు సేంద్రియ ఎరువులు, జీవన ఎరువులు వాడాలని, రసాయనిక ఎరువులు వాడకూడదని క్రిబ్ కో ఏరియా మేనేజర్ శ్రీనివాస్ రావు అన్నారు. డీసీఎంఎస్‌లో రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రసాయనక ఎరువులు వాడితే ప్రజల ఆరోగ్యానికి మంచిది కాదని, రైతులు యూరియా ఎక్కువ వాడకూడదని, తక్కువ మోతాదులో వేయాలన్నారు. ఈ కార్యక్రమంలో క్రిబ్ కో జిల్లా మేనేజర్ వివేక్, ఉమ్మడి మెదక్ జిల్లా డీసీఎంఎస్ డైరెక్టర్ కాత కనకరాజు, సిద్దిపేట ఫర్టిలైజర్ ఓనర్లు, నియోజకవర్గ రైతులు పాల్గొన్నారు.



విద్యార్థులకు ఉచిత బస్ పాసులు పంపిణీ

నవతెలంగాణ-దౌల్తాబాద్

మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, ఆదర్శ పాఠశాల విద్యార్థులకు ఉచిత బస్ పాసులను గ్రామ బస్సు అధికారులు దొంతుల కృష్ణ, కొకురి సిద్దిరాములు అందజేసారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రతీ గ్రామానికి ఆర్టీసీ సేవలు అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



చిరు ధాన్యాలతో రైతులకు ఎంతో మేలు

- సీసీసి జిల్లా నాయకులు ప్రవీణ్



నవతెలంగాణ-మిరుదొడ్డి

మిరుదొడ్డి మండలం లింగుపల్లి గ్రామంలో సెంటర్ ఫర్ వరల్డ్ సాలి డారిటీ సహకారంతో నేలమ్మా మహిళ రైతుల పరస్పర సహకార సంఘం సభ్యులకు, తొగుట, మిరుదొడ్డి మండలాలకు సంబంధించిన మహిళా రైతులకు విత్తనాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఆరుతడి పంటలైన చిరుదాన్యాలు, పప్పు పంటలు జొన్నలు, కందులు, తైదలు మొదలైన విత్తనాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ బాల నరసింహ మాట్లాడుతూ , చిరుధాన్యాల పంటలు పప్పు ధాన్యాల పంటలు తినడం వల్ల మనిషికి గుండె జబ్బులు, రక్తపోటు నుంచి రక్షణ పొందడంతో పాటు మధుమేహం వ్యాధి బారిన పడకుండా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చన్నారు. పోషకాహార లోపంతో పిల్లలు పెద్దలు అనారోగ్య బారిన పడుతున్నారన్నారు. అదేవిధంగా చిరుధాన్యాల పంటలు పప్పు పంటలు వేసుకోవడం వల్ల, వాటిని తినడం వల్ల మానవులకు రోగనిరోధక శక్తి పెరుగుతుందన్నారు. అంతే కాకుండా చిరుధాన్యాల పంటలు వేసుకోవడం వల్ల భూమికి సారం పెరుగుతుందన్నారు. భూమిలో పోషక విలువలు పెరుగుతాయన్నారు. ఈ కార్యక్రమంలో కో ఆర్డినేటర్ ప్రవీణ్ అందె.మిరుదొడ్డి సర్పంచ్ రంగానబోయిన రాములు, శ్వేతా సుజాత ముత్యాలు అంగన్వాడి టీచర్ అనురాధ ఆశా వర్కర్ బాలమణి ఏఈఓ రేణుక నేలమ్మ సంఘం సభ్యులు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

గజ్వేల్ కాంగ్రెస్ సీనియర్ నేతలు రహస్య భేటీ



నవతెలంగాణ-గజ్వేల్

గజ్వేల్ నియోజకవర్గంలో ఆయా మండలాల పార్టీ మాజీ అధ్యక్షులు, యువజన విభాగం రాష్ట్ర నాయకులు కలిసి రహస్య సమావేశం ఏర్పాటు చేశారు. గజ్వేల్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ పరిస్థితిని ఈ సమావేశంలో చర్చించుకున్నారు. నియోజకవర్గంలోని ఎనిమిది మండలాల పార్టీ మాజీ అధ్యక్షులు, పార్టీ సీనియర్లు సమావేశమయ్యారు. ఇందులో ములుగు మాజీ ఎంపీపీ వెంకట్రాంరెడ్డి, సీనియర్లు లక్ష్మారెడ్డి, జనార్దన్ రెడ్డి, నేత మహేందర్, తూప్రాన్ వైస్ ఎంపీపీ భాస్కర్ రెడ్డి. మామిడాల శ్రీనివాస్, రాష్ట్ర యువజన కాంగ్రెస్ నాయకులు సర్దార్ ఖాన్, తిగుల్ సర్పంచ్ భాను ప్రకాష్ రావు, కొండపాక యువజన సంఘం నాయకులు విజయకుమార్. నియోజకవర్గంలో ముఖ్య నాయకులంతా సమావేశమయ్యారు.

పార్టీకి పనిచేసిన వారికి గుర్తింపు లేదు

ఆపదలో పార్టీ కోసం కృషి చేసిన నాయకులను మర్చిపోయినట్లు ములుగు మాజీ ఎంపీపీ వెంకట్రామిరెడ్డి, జయదేవ్పూర్ మాజీ జెడ్పిటిసి లక్ష్మారెడ్డి, మాజీ సింగిల్ విండో ఛైర్మన్ జనార్దన్ రెడ్డి, తూప్రాన్ వైస్ ఎంపీపీ భాస్కర్ రెడ్డి మండిపడ్డారు. పార్టీ కష్టాల్లో ఉన్నప్పుడు ముందున్న కార్యకర్తలను జిల్లా నాయకత్వం మర్చిపోవడం విడ్డూరం గా ఉందన్నారు. ఈ విషయాన్ని పిసిసి అధ్యక్షులు రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకుపోయినట్లు వారు పేర్కొన్నారు. భవిష్యత్ కార్యాచరణను రెండు మూడు రోజుల్లో ప్రకటిస్తామన్నారు. గజ్వేల్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పరిస్థితి అందోళనకరంగా ఉందని వారు ఆవేదన చెందారు. పార్టీ అధిష్టానం దృష్టికి తీసుకుపోయినట్లు వారు తెలిపారు.

ఇప్పటికే గజ్వేల్ కాంగ్రెస్ లో మూడు కుంపట్లు

గజ్వేల్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీలో ఇప్పటికే మూడు కుంపట్లు ఉన్నాయి. సిద్దిపేట జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మాదాటి జస్వంత్ రెడ్డి, రాష్ట్ర నాయకులు బండారు శ్రీకాంత్ రావు వేర్వేరు కుంపట్లు పెట్టి నియోజకవర్గంలో పర్యటిస్తున్నారు. పిసిసి అధ్యక్షులు రేవంత్ రెడ్డి సూచన మేరకు గజ్వేల్ నియోజకవర్గానికి పరిశీలకుగా పనిచేస్తున్న ప్రమోద్ కుమార్ మాత్రం సిద్దిపేట జిల్లా అధ్యక్షులు తూముకుంట నర్సారెడ్డి చేపట్టే కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటున్నారు. అంతేకాకుండా ఇటీవల గ్రూపులను ప్రోత్సహిస్తున్న నాయకులను హెచ్చరించారు. ఇక నాలుగో కుంపటి కూడా తయారైందని చెప్పాలి.

మంత్రి కేటీఆర్ తక్షణమే మేరు కులానికి క్షమాపణ చెప్పాలి



నవతెలంగాణ-నంగునూరు

మంత్రి కేటీఆర్ తక్షణమే మేరు కులానికి క్షమాపణ చెప్పాలని మేరుకుల మండల అధ్యక్షుడు అన్న రాజయ్య మేరు డిమాండ్ చేశారు. మంత్రి కేటీఆర్ వ్యాఖ్యలను నిరసిస్తూ శనివారం నంగునూరు మండల కేంద్రంలో నల్ల బ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా అన్న రాజయ్య మాట్లాడుతూ గత నెల 30న మహబూబాబాద్ సభలో మంత్రి కేటీఆర్ మేరు కులాన్ని మోసగాడిలా అభివర్ణించారని ఆవేదన వ్యక్తంచేశారు. దొంగలా మేరు కులాల్ని దూషిస్తూ చెప్పిన కథలో తమ కులాన్ని అవహేళన చేస్తూ మాట్లాడారన్నారు. మంత్రి కేటీఆర్ తక్షణమే మేరు కులానికి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో మేరు కులస్తులు అందరూ కలసి నిరసనలు, ర్యాలీలు జరుపుతామన్నారు. ఈ కార్యక్రమంలో మేరు కుల సంఘం నాయకులు చేగూరి వెంకటాద్రి మేరు, కీర్తి లక్ష్మీనరసయ్య మేరు, గూడూరి బేగిరావు మేరు, కీర్తి రాజుమేరు, చేగూరి నర్సింలు మేరు, కీర్తి శ్రీధర్ మేరు, కీర్తి ప్రవీణ్ మేరు తదితరులు పాల్గొన్నారు.

కుల సంఘాల ద్వారా కొబ్బరికాయల అమ్మకం



నవతెలంగాణ-కొమురవెల్లి

కొమురవెల్లి గ్రామపంచాయతీ లైసెన్స్ పొంది కులసంఘాల ఆధ్వర్యంలో మల్లన్న ఆలయం వద్ద కొబ్బరికాయల అమ్మకాలు నిర్వహిస్తామని గ్రామస్తులు తెలిపారు. శనివారం గ్రామపంచాయతీ వద్ద కుల సంఘాల ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇటీవల కొమురవెల్లి మల్లికార్జున స్వామి ఆలయంలో కొబ్బరికాయల వేలాన్ని రద్దు చేస్తున్నట్లు పాలకవర్గం ప్రకటించడంతో గ్రామ కుల సంఘాల ఆధ్వర్యంలో కొబ్బరికాయల అమ్మకాలు జరపాలని ఏకగ్రీవంగా తీర్మానించినట్లు తెలిపారు. ఈ అమ్మకాల ద్వారా వచ్చిన సంపాదనలో కొంత సొమ్మును గ్రామ అభివృద్ధికి ఇవ్వాలని ఏకగ్రీవంగా తీర్మానం జరిగిందని గ్రామస్తులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సార్ల లతా కిష్టయ్య, జెడ్పీటీసీ సిద్దప్ప, ఉప సర్పంచ్ శ్రీధర్, నాయకులు మంకాల సతీష్, ముత్యం నర్సింలు గౌడ్, గొల్లపల్లి కిష్టయ్య, లింగంపల్లి శ్రీనివాస్, రాములు చారి, పలు కులసంఘాల అధ్యక్షులు గ్రామస్తులు పాల్గొన్నారు

అంగరంగ వైభవంగా బోనాల ఊరేగింపు



నవతెలంగాణ-మిరు దొడ్డి

అంగరంగ వైభవంగా శ్రీ మహంకాళి అమ్మవారి బోనాలు ఘనంగా నిర్వహించారు. మిడిదొడ్డి మండల కేంద్రంలోని శ్రీ మహంకాళి అమ్మవారి దేవాలయంలో మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించి గ్రామంలో వీధుల గుండా బోనాలు ఊరేగించారు.. ఆషాడ మాసాన్ని పురస్కరించుకొని వర్షాలు సమృద్ధిగా కురవాలని, పంటలు బాగా పండాలని గ్రామ ప్రజలు సుభిక్షంగా ఉండాలని కోరుతూ అమ్మవారికి బోనాల సమర్పించారు. వైదిక నిర్వాహకులు రాజ పున్నయ్య శర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి అలంకరణ, కుంకుమార్చన, కార్యక్రమాలను నిర్వహించారు. డప్పు చప్పుల మధ్య, బైండ్ల వారి నృత్యాలతో, పోతురాజుల ఆటలతో, శివసత్తులు శివమెత్తుతూ అమ్మవారికి బోనాలు తీశారు. బోనాల కార్యక్రమంతో గ్రామంలో ఒక పండుగ వాతావరణం నెలకొంది. ఈ కార్యక్రమంలో మున్నూరు కాపు సంఘ సభ్యులు, దేవాలయ కమిటీ సభ్యులు, గ్రామ ప్రజలు భక్తులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా డాక్టర్స్ డే





నవతెలంగాణ-సిద్దిపేట

అంతర్జాతీయ డాక్టర్స్ డే, చార్టెడ్ అకౌంట్ డే సందర్భంగా స్థానిక వైశ్య భవనంలో వాసవి క్లబ్, వాసవి వనిత క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో డాక్టర్లను, చార్టెడ్ అకౌంటర్‌లను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ కోఆర్డినేటర్స్ యాద శ్రీనివాస్, గంప కృష్ణమూర్తిలు మాట్లాడుతూ గత 25 సంవత్సరాలుగా డాక్టర్లను, చార్టెడ్ అకౌంట్స్‌లను సన్మానించడం జరుగుతుందన్నారు. కనిపించే దేవుళ్ళు డాక్టర్లు అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో చార్టెడ్ అకౌంటెంట్స్ కాచం శేఖర్, అల్లాడి సాయి తేజ, గట్టు సాయి శశాంక్, డాక్టర్లు డాక్టర్ శివానందం, మంజూష, అయిత లింగమూర్తి, అమిరిశెట్టి భాస్కర్, యాంసాని సందీప్, యాంసాని ఉమా మౌనిక, వెనిశెట్టి గణేష్, కొండ శ్రవణ్, కొండ అలేఖ్య ,గట్టు సందీప్, అమిరిశెట్టి సంతోష్, దొంతుల బాల సునీల్ కుమార్, బుక్క మహేష్ కుమార్, చింత విక్రమ్‌లను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో డిస్టిక్ట్ ఇంచార్జ్ మాంకాల నవీన్ కుమార్, క్యాబినెట్ సెక్రటరీ పుల్లూరి శశాంక్, రీజియన్ సెక్రటరీ మంకాల శ్రీనివాస్, పుల్లూరి శ్రీనివాస్, ఇంగు అమర్నాథ్, వాసవి క్లబ్ , వనిత క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు, కోశాధికారులు చింత రాజేంద్రప్రసాద్, తొడుపునూరి కృష్ణవేణి, చకిలం రవి, కొమరవెల్లి కల్పన, చొక్కారపు శ్రీధర్, బూరుగు వేణుగోపాల్, తిమ్మిశెట్టి విజయలక్ష్మి, పిఆర్ఓ అయిత శంకర్, గ్రీటింగ్ చైర్మన్ మర్యాల వీరేశం, కటుకం మోనయ్య,ఉప్పల రమేష్, ఆకుల వెంకటేశం, రమేష్, వీరేశం, నాగరాజు, నాగేందర్, దుర్గయ్య,రమేష్ , శ్రీనివాస్, మల్లికార్జున్, శివాని, సరోజ, వినోద, మంజుల, సంతోషి, వైశ్య సంఘం అధ్యక్షులు గట్టు రవీందర్, కోశాధికారి కూర శ్రీనివాస్, వాసవి క్లబ్, వాసవి వనిత క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-కోహెడ

మండల కేంద్రంలోని అశ్విని క్లినిక్ ఆసుపత్రిలో డాక్టర్స్ డే దినోత్సవం, జాతీయ తపాల దినోత్సవాన్ని పురస్కరించుకొని కోహెడ లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో శనివారం డాక్టర్‌లు ఇంద్రసేనారెడ్డి, బద్దం తిరుపతిరెడ్డి, హరినారాయణలతో పాటు పోస్టాఫీస్ సిబ్బంది ఎలసాని దర్గారెడ్డిలను శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజా ఆరోగ్యాన్ని దృష్టిలోకి తీసుకొని ఎల్లవేలల ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలు చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో జోనల్ ఛైర్‌పర్సన్ దొమ్మాట జగన్‌రెడ్డి, అధ్యక్షుడు పొన్నాల లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శి కందారపు ప్రసాద్, కోశాధికారి తిప్పారపు నాగరాజు, జిల్లా క్యాబినెట్ మెంబర్ డాక్టర్ కోహెడ ప్రసాదరావు, సభ్యులు పెర్యాల సుధాకర్‌రావు, గంగం సంతోష్, మాజీ అధ్యక్షుడు భైరినేని సుకుమార్‌రావు, సీనియర్ సభ్యులు సింగిరెడ్డి మల్లారెడ్డి, మేకల సురేందర్‌రెడ్డి, గుగ్గిళ్ళ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ- గజ్వేల్

లయన్స్ క్లబ్ సేవలు అభినందనీయమని ఎమ్మెల్సీ డాక్టర్ యాదవ రెడ్డి అన్నారు. గజ్వేల్ ఆర్ అండ్ ఆర్ కాలనీలో శనివారం లయన్స్ క్లబ్ ఆఫ్ స్నేహ అనుబంధ సంస్థల ఆధ్వర్యంలో మేఘా హెల్త్ క్యాంప్ నిర్వహించారు, డాక్టర్లకు ఘన సన్మానం చేసి, అల్పాహార పంపిణీ, వృద్ధులకు పండ్లు పంపిణీ, విద్యార్థులకు బిస్కెట్లు, బ్రెడ్ అందజేశారు. లైన్స్ క్లబ్ సభ్యుల ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్సీ డాక్టర్ యాదవ రెడ్డి మాట్లాడుతూ లయన్స్ క్లబ్ సేవకు ప్రతిరూపమని ప్రపంచవ్యాప్తంగా లయన్స్ క్లబ్ సేవలు నిర్వహిస్తూ ప్రజల్లో మంచి ఆదరణ పొందిందని గజ్వేల్ ప్రాంతంలో లైన్స్ క్లబ్ ఆఫ్ స్నేహ సేవలు చాలా గొప్పవని లయన్స్ క్లబ్ ఆఫ్ స్నేహ, మేధ, ప్రజ్ఞ,లియో, క్లబ్స్ వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. అలాగే నూతనంగా ఏర్పడ్డ లయన్స్ క్లబ్ ఆఫ్ గజ్వేల్ మహతి మహిళా విభాగం సభ్యులకు అభినందనలు తెలిపారు. లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో డాక్టర్లకు సన్మానం చేయడం సంతోషంగా ఉందని లయన్స్ క్లబ్ సేవలు విస్తృత స్థాయిలో నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు శీర్ల శ్యామల మల్లేశం, లక్ష్మి కిషన్ రెడ్డి, ఉప్పల మెట్టయ్య,కో ఆప్షన్ సభ్యులు నంగునూరి విజయలక్ష్మి సత్యనారాయణ,మార్కెట్ కమిటీ డైరెక్టర్ సయ్యద్ మతీన్, కొండ పోచమ్మ దేవస్థానం డైరెక్టర్ గోలి సంతోష్, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ లింగం, లయన్స్ క్లబ్ ఆఫ్ స్నేహ అధ్యక్షులు నేతి శ్రీనివాస్, లయన్స్ క్లబ్ ఆఫ్ ప్రజ్ఞ అధ్యక్షులు పరమేష్, లయన్ రామ్ ఫణీధర్ రావు, పరమేశ్వర చారి, లయన్ రాధాకృష్ణ, సంజయ్ గుప్త, ఎల్లం రాజు, లయన్స్ క్లబ్ సభ్యులు, డాక్టర్స్, బి ఆర్ ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



ప్రైవేట్ విద్యా సంస్థలకు తొత్తుగా మారిన ఎంఈఓను సస్పెండ్ చేయాలి

- ఎస్ఎఫ్ఐ చేర్యాల డివిజన్ అధ్యక్షులు ఆముదాల రంజిత్ రెడ్డి

నవతెలంగాణ-చేర్యాల

ప్రైవేటు విద్యాసంస్థలకు తొత్తుగా మారి వాటిపై చర్యలు తీసుకోని చేర్యాల ఎంఈఓను సస్పెండ్ చేయాలని ఎస్ఎఫ్ఐ చేర్యాల డివిజన్ అధ్యక్షులు ఆముదాల రంజిత్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని ఎస్ఎఫ్ఐ కార్యాలయంలో శనివారం ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. సమావేశంలో రంజిత్ రెడ్డి మాట్లాడుతూ చేర్యాల మండల కేంద్రంలో ఎలాంటి గుర్తింపు లేకుండా మహర్షి ముసుగులో శ్రీ చైతన్య పాఠశాల ను నడుపుతూ, నిబంధనలను తుంగలో తొక్కి ప్రైవేటు పాఠశాలల్లో పుస్తకాలు అమ్మడాన్ని ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో అనేక మార్లు ఎంఈఓ దృష్టికి తీసుకుపోయినప్పటికి ఎలాంటి చర్యలు తీసుకోలేదని తెలిపారు. ప్రైవేటు పాఠశాలలను ఎంక్వయిరీ చేసి చర్యలు తీసుకుంటామన్న ఎంఈఓ వారం రోజులు గడుస్తున్నా శ్రీ చైతన్య ప్రైవేట్ విద్యాసంస్థల పైన చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. శ్రీ చైతన్య పాఠశాల నుంచి ముడుపులు ముడుతున్నాయని ఆరోపించారు. ఇలాగే కొనసాగితే చేర్యాలలో ప్రభుత్వ విద్య ఉండదని, కేవలం ప్రైవేట్ కార్పొరేట్ విద్యా సంస్థలే నడుస్తాయన్నారు. తక్షణమే ఎంఈఓని సస్పెండ్ చేస్తూ చేర్యాలలో ప్రైవేట్ కార్పొరేట్ విద్యాసంస్థల ఫీజుల దోపిడీని అరికట్టాలన్నారు. లేని పక్షంలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఉద్యమాలు నిర్వహిస్తామన్నారు. ఈ సమావేశంలో డివిజన్ నాయకులు నితిన్, రాకేష్, మధు, హరి పాల్గొన్నారు.



ఆర్యవైశ్య కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

నవతెలంగాణ-సిద్దిపేట

ఆర్యవైశ్యుల సమస్యలను దృష్టిలో పెట్టుకుని త్వరలో ఆర్యవైశ్య కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాన్ని రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ కార్యదర్శి గంప శ్రీనివాస్, ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అయిత రత్నకర్, జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు కాసం నవీన్ కుమార్ డిమాండ్ చేశారు. శనివారం వారు మాట్లాడుతూ తెలంగాణలో జరిగిన 2018 సాధారణ ఎన్నికల్లో టీఆర్ఎస్ పార్టీ గెలిస్తే ఆర్యవైశ్య కార్పొరేషన్ ఏర్పాటు చేస్తామని మానిఫెస్టోలో ప్రకటించిన విధంగా త్వరలో ఆర్యవైశ్య కార్పొరేషన్ ఎర్పాటు చేసి, ఒక వెయ్యి కోట్ల రూపాయలను కేటాయించాలని కోరారు. కార్పొరేట్ వ్యవస్థ వచ్చిన తర్వాత పెద్ద పెద్ద మాల్స్ వచ్చి చిన్న వ్యాపారులు చాలా నష్ట పోయారని, వ్యాపారాలు నడవక చాలా మంది వైశ్యులు అప్పుల పాలై ఒకనాడు దుకాణానికి యజమనిగా ఉన్నవారు ఎంతో మంది గుమస్తాలుగా పని చేస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. ఆర్యవైశ్యులు చాలామంది వ్యాపారం మీదనే ఆధారపడి ఉంటారని, వైశ్య కార్పొరేషన్ ఏర్పాటు చేసి ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలన్నారు. సబ్సిడీతో పాటు వడ్డీలేని రుణాలు పొంది చిన్న వ్యాపారులు వారి వ్యాపారం చేస్తు కొంతవరకు సమాజంలో గౌరవంగా బ్రతుకుతారన్నారు. సీఎం కేసీఆర్, మంత్రి హరీశ్ రావులు స్పందించి కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని కోరారు. లేని ఎడల పెద్ద ఎత్తున ఆర్యవైశ్య మహాసభ ఆధ్వర్యంలో వైశ్యులతో ఉద్యమం చేపట్టి తమ హక్కులను సాధించుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆర్యవైశ్య మహాసభ ప్రధాన కార్యదర్శి తడక లింగమూర్తి, వర్కింగ్ ప్రెసిడెంట్ ఉప్పల పాండురంగం, జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు హేమలత, కోశాధికారి మరియాల వాణి, జిల్లా యువజన విభాగం ప్రధాన కార్యదర్శి పుల్లూరి శివకుమార్, జిల్లా వాసవి సేవాదల్ కోశాధికారి చింత రాజేంద్ర ప్రసాద్, వర్కింగ్ ప్రెసిడెంట్ మంకల నవీన్ కుమార్, సిద్దిపేట డివి జన్



చైర్మన్ గంప కృష్ణమూర్తి, కార్యదర్శి గంగిశెట్టి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సాయి చందు మరణం తెలంగాణకు తీరని లోటు

- సర్పంచ్ నీరటి కవిత రవీందర్



నవతెలంగాణ -సిద్దిపేటరూరల్

తెలంగాణ ఉద్యమకారుడు కవి గాయకుడు రాష్ట్ర గిడ్డంగుల చైర్మన్ సాయి చందు మరణం తెలంగాణకు తీరని లోటని సర్పంచ్ నీరటి కవిత రవీందర్ అన్నారు . శనివారం సిద్దిపేట రూరల్ మండల పరిధిలోని రావురూకుల గ్రామంలో సాయి చందు చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.. ఈ కార్యక్రమంలో గ్రామ శాఖ అధ్యక్షులు నాగరాజు, వార్డు సభ్యులు, బాబ, రాజయ్య, బాలకిషన్, రాజ్ కుమార్, తిరుపతి, నాయకులు సత్యానందం మురళి, బాలకిషన్, తిరుమలేష్, రాజు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు

రాజయ్య మృతి బాధాకరం

సర్పంచ్ కుటుంబానికి మెదక్ ఎంపీ పరామర్శ



నవతెలంగాణ-దుబ్బాక రూరల్

ఇటీవల దుబ్బాక మండల పరిధిలోని పద్మనాభుని పల్లి గ్రామ సర్పంచ్ కండ్లకోయ పర్శరాములు తండ్రి రాజయ్య గుండెపోటుతో మృతి చెందారు. ఈ విషయం పలువురు బీఆర్ఎస్ నాయకుల ద్వారా మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డి తెలుసుకొని శనివారం సర్పంచ్ సభ్యులను కలిసి పరామర్శించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ సర్పంచ్ తండ్రి రాజయ్య అకాల మరణం అత్యంత బాధాకరం, ఆయన లేని లోటు తీరనిదని అన్నారు. కార్యక్రమంలో ఎంపీ వెంట జెడ్పీటీసీ కడతల రవీందర్ రెడ్డి, పీఏసియస్ చైర్మన్ షేర్ల కైలాసం, బీఆర్ఎస్ సీనియర్ నాయకుల రొట్టె రాజమౌళి, డీసీసీబీ డైరెక్టర్ బక్కి వెంకటయ్య ,బీఆర్ఎస్ పార్టీ దుబ్బాక మండల అధ్యక్షుడు బాణాల శ్రీనివాస్,అక్బర్ పేట భూంపల్లి మండల అధ్యక్షుడు జీడిపల్లి రవి,చింతల కృష్ణ, కొత్త కిషన్ రెడ్డి తదితరులున్నారు.

కృష్ణ గౌడ్ కుటుంబాన్ని ఆదుకుంటాం

వర్గల్ రైతుబంధు చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి



నవతెలంగాణ-వర్గల్

గౌరారం గ్రామానికి చెందిన నగరం కృష్ణ గౌడ్ మృతిచెందగా, బాధిత కుటుంబాన్ని అన్ని రకాలుగా ఆదుకుంటామని వర్గల్ మండల రైతు బంధు చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు . మృతుడికి రైతుభీమా పథకం వర్తింపనుండగా , శనివారం భార్య అన్నపూర్ణ నుంచి వివరాలు సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు సీఎం కేసీఆర్ రైతుల ఆర్థిక పరిస్తితులను దృష్టిలో పెట్టుకొని ముందుచూపుతో ప్రతి రైతుకు భీమా వర్తింప చేసినట్లు తెలిపారు. దీంతో ఆ కుటుంబానికి భరోసా , భీమా కల్పించినట్లు అయిందని , త్వరలోనే రూ 5 లక్షలు బాధిత కుటుంబానికి అందజేయనున్నట్లు చెప్పారు.

మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం

నవ తెలంగాణ- గజ్వేల్



గజ్వేల్ మండలం దాచారం గ్రామంలో మృతి చెందిన ఏలేశ్వరం నరేష్ కుటుంబ సభ్యులను శనివారం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు టిపిసిసి డెలిగేట్ సభ్యులు మాదాడి జశ్వంత్ రెడ్డి పరామర్శించి ఆర్థిక సహాయం అందజేశారు. వీరితో పాటు బురుగు పల్లి కిష్టరెడ్డి, దాచారం వెంకట్ రెడ్డి, నర్సింహులు నర్సంపల్లి నాగరాజు, మైనార్టీ నాయకులు అజ్జార్ యూత్ కాంగ్రెస్ సమీర్ తదితరులు ఉన్నారు.

బాధిత కుటుంబాలకు ఎమ్మెల్యే పరామర్శ



నవతెలంగాణ-బెజ్జంకి

మండల పరిధిలోని వీరాపూర్,గాగీల్లపూర్ గ్రామాల్లో వివిధ కారణాలతో మృతి చెందిన చిలుముల పవన్, తూముల రాములు, మేడి చంద్రవ్వ మృతి చెందగా శనివారం ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. అంతకుముందు మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం వద్ద లబ్ధిదారులకు ఎమ్మెల్యే రసమయి సీఎంఆర్ఎఫ్ చెక్కులందజేశారు.అయా గ్రామాల సర్పంచులు,ఎంపీటీసీలు,బీఆర్ఎస్ అనుబంధ కమిటీల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నాణ్యతలేని సీసీ రోడ్లు

- దస్ట్ కంకర సిమెంట్ ● కనిపించని ఇసుక
- పట్టించుకోని అధికారులు
- మన్నికతో సిసి రోడ్లు వేయాలి





నవతెలంగాణ-నిజాంపేట

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతి గ్రామంలో గల్లీలలో సీసీ రోడ్లు వేయాలని వేలకోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నది. నిజాంపేట మండల కేంద్రంలో నాసిరకంగా సీసీ పనులు నడిపిస్తున్నారని మండల బీజేపీ అధ్యక్షుడు చంద్రశేఖర్ తెలిపారు. నిజాంపేట మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం నుంచి గాంధీ విగ్రహం వరకు ప్రభుత్వం దాదాపు రూ.35 లక్షలు మంజూరు చేసిందని, కాంట్రాక్టర్లు పూర్తిగా డస్ట్ తోనే సీసీ రోడ్లు వేస్తున్నారని మండిపడ్డారు. ప్రభుత్వ నిబంధన ప్రకారం కంకర ఇసుక సిమెంటు సమపాళ్లలో కలిపి సీసీ రోడ్డు వేయాలని నిబంధనలు ఉన్నప్పటికీ కాంట్రాక్టర్లు అవేమీ పట్టించుకోవడం



లేదన్నారు. సీసీ రోడ్లను అధికారులు దగ్గరుండి చూడవలసిన బాధ్యతలు ఉన్నప్పటికీ ఏ ఒక్క అధికారి కూడా సీసీ రోడ్లను పర్యవేక్షించడం లేదన్నారు. పూర్తిగా డస్ట్ తోనే సీసీ రోడ్డు వేయడం వలన తొందరగా రోడ్డు పగిలిపోయే ప్రమాదం ఉందన్నారు. గతంలో సీసీ రోడ్డు పగిలిపోయినందునే అదే రోడ్డుపైన సిసి రోడ్డు వేస్తున్నారని ప్రభుత్వ నిధులను కాంట్రాక్టర్లు దుర్వినియోగం చేస్తున్నారని మండిపడ్డారు. సిసి రోడ్డు విషయంలో నాణ్యత ప్రమాణాలు పాటించని యెడల బీజేపీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు చేపడతామన్నారు.

రెడ్డి సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక

నవతెలంగాణ-వెల్దుర్తి

మండల కేంద్రమైన వెల్దుర్తిలో ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్లో శనివారం మండల రెడ్డి సంఘం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. మెదక్ జిల్లా కార్యవర్గం గౌరవాధ్యక్షులు ప్రభురెడ్డి, ఉపాధ్యక్షులు బాగారెడ్డి కార్యదర్శి శ్రీకాంత్ రెడ్డి జగపతి రెడ్డి సూర్యకాంత్ రెడ్డి సాయి రెడ్డి ప్రతాపరెడ్డి ఆధ్వర్యంలో వెల్దుర్తి మండల నూతనంగా రెడ్డి సంఘం అధ్యక్ష కార్యదర్శులను ఎన్నుకోవడం జరిగింది. నూతనంగా ఎన్నుకోబడిన మండల గౌరవ అధ్యక్షుడిగా హనుమంత్ రెడ్డి మండల రెడ్డి సంఘం అధ్యక్షులుగా వెన్నవరం శ్రీనివాస్ రెడ్డి ఉపాధ్యక్షుడిగా దుర్గా రెడ్డి జనరల్ సెక్రెటరీగా బంకర్ రెడ్డి ట్రెజరర్ బాగా రెడ్డి లను ఎన్నుకోవడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ మండల రెడ్డి సంఘం అభివృద్ధికి అన్ని రకాలుగా తన వంతు సహకారం అందిస్తూ కృషి చేస్తానని రెడ్డి కులంలో ఆర్థికంగా వెనుకబడిన వారికి ప్రభుత్వం నుంచి వచ్చే అన్ని సదుపాయాలను వారికి చేరే విధంగా కృషి చేస్తానన్నారు. తనపై నమ్మకం ఉంచి తనకు బాధ్యతలు అందించిన మండల రెడ్డి సంఘం సభ్యులకు ఈ సందర్భంగా ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు ఈ కార్యక్రమంలో ఉప్పు లింగాపూర్



మహేష్ రెడ్డి సర్పంచ్ల పోర మండల అధ్యక్షుడు సర్పంచ్ అశోక్ రెడ్డి నరేందర్ రెడ్డి ప్రతాపరెడ్డి భూపాల్ రెడ్డి శ్రీనివాస్ రెడ్డి ఇంద్రారెడ్డి తోపాటు మరికొంతమంది ఉన్నారు నూతనంగా ఎన్నుకోబడిన కార్యవర్గానికి శాలువాలతో సన్మానించారు.

బోనాల పండుగకు మంత్రికి ఆహ్వానం



నవతెలంగాణ-గజ్వేల్

గజ్వేల్ మహంకాళి అమ్మ తల్లి బోనాల పండుగ రావాలని నిర్వాహకులు మంత్రితో పాటు పలువురు ప్రముఖులకు ఆహ్వాన పత్రికను అందజేశారు. తెలంగాణ రాష్ట్ర ఆర్థిక, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీష్ రావు, మెదక్ పార్లమెంట్ సభ్యులు కొత్త ప్రభాకర్ రెడ్డి, ఎమ్మెల్సీ డాక్టర్ యాదవ రెడ్డి, ఎఫ్డీసీ చైర్మన్ వంటేరు ప్రతాపరెడ్డి, పట్టణ ప్రముఖులకు, మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ కాంతారావులకు నిర్వాహకులు ఆహ్వాన పత్రికలను అందజేశారు. ఈ కార్యక్రమంలో గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్మన్ రాజమౌళి, వారి వెంట కౌన్సిలర్ బొల్లిపల్లి బాలమణి శ్రీనివాస్ రెడ్డి, ఆలయం కమిటీ సభ్యులు తలకొక్కుల దుర్గాప్రసాద్, దేవలపల్లి రాజారాం తదితరులు ఉన్నారు.

సీఎం సహాయ నిధి పేదలకు వరం

మెదక్ ఎమ్మెల్సీ డాక్టర్ యాదవ రెడ్డి



నవతెలంగాణ- గజ్వేల్

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పేదల ఆరోగ్య పరిరక్షణ కోసం సీఎం సహ నిధి ఏర్పాటు చేసి ఎంతోమంది పేదలను ఆర్థికంగా ఆదుకుంటుందని మెదక్ ఎమ్మెల్సీ డాక్టర్ యాదవ రెడ్డి అన్నారు. శనివారం గజ్వేల్ పట్టణం చెందిన అనాజీపూర్ బిక్షపతి రెడ్డికి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి హరీష్ రావు కృషితో పేదలకు ఆరోగ్య సమస్యలు వచ్చి ఆసుపత్రుల ఖర్చుల నిమిత్తం కొంతమేరకు సహాయం అందిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో కొండపోచమ్మ డైరెక్టర్ నిమ్మ రమేష్, దాచారం వెంకట నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రేట్ కార్డు పెట్టి ప్రభుత్వాన్ని నడిపిస్తుంది బీఆర్ఎస్

బీజేపీ జాతీయ నాయకులు, మధ్యప్రదేశ్ ఇంచార్జి మురళీధర్ రావు



నవ తెలంగాణ - సిద్దిపేట

తెలంగాణ రాష్ట్రంలో అధికారులకు ట్రాన్స్ఫర్ కావాలంటే రేట్ కార్డును పెట్టి ప్రభుత్వాన్ని కేసీఆర్ నడిపిస్తున్నాడని, కాంగ్రెస్ పాలనలో దేశవ్యాప్తంగా అవినీతి జరిగిందని, బీఆర్ఎస్ పాలనలో అవినీతి పాలన జరుగుతుందని భారతీయ జనతా పార్టీ జాతీయ నాయకులు, మధ్యప్రదేశ్ ఇంచార్జి పోల్సాని మురళీధర్ రావు అన్నారు. మోడీ తొమ్మిది సంవత్సరాల పాలన పూర్తయిన సందర్భంగా పార్టీ పిలుపు మేరకు మహాజన సంపర్క్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా శనివారం సిద్దిపేటలోని వెంకటేశ్వర ఆలయం వద్ద జిల్లా అధ్యక్షుడు దూది శ్రీకాంత్ రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు అనేక రాష్ట్రాలలో కుటుంబాల పాలన కొనసాగుతుందని, కుటుంబ పార్టీలను సమూలంగా సమాధి చేస్తేనే దేశం అభివృద్ధి చెందుతుందని అన్నారు. సిద్ధాంతం, దేశం కోసం పని చేస్తున్నది బీజేపీ అని అన్నారు. గాలి, పాతాలం, భూమి ఏది వదలకుండా కాంగ్రెస్ పాలనలో అవినీతి జరిగిందని, టిఆర్ఎస్ పాలనలో చెరువులన్నీ కబ్జా లకు గురవుతున్నాయన్నారు. ఏ పార్టీలో చూసినా అధ్యక్షుని తర్వాత ఎవరు అధ్యక్షుడు అవుతాడు చెప్పవచ్చు కానీ, బీజేపీలో ఎవరైనా అధ్యక్షులు కావడానికి అవకాశం ఉందన్నారు. కేంద్రంలో నరేంద్ర మోదీ సారథ్యంలో ఏర్పడిన బిజెపి ప్రభుత్వ పాలనలో దేశం అన్ని రంగాల్లో రాణిస్తుందన్నారు.మూడవసారి కూడా మళ్ళీ మోడీ ప్రధాని కావాలంటూ దేశ ప్రజలు కోరుతున్నారని ఆశాభావం వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్రాన్ని సీఎం కేసీఆర్ అప్పుల కుప్పగా మార్చారని ఆరోపించారు. రాష్ట్ర రైతాంగానికి సీఎం కేసీఆర్ హామీ ఇచ్చిన రుణమాఫీ ఇంకా ఎప్పుడు జరుగుతుందని ప్రశ్నించారు. తెలంగాణ రాష్ట్ర రైతులకు మేలు చేయని సీఎం కేసీఆర్ దేశ్ కి నేత అంటూ ఇతర రాష్ట్రాలు తిరగడం హాస్యాస్పదమన్నారు. తెలంగాణ రాష్ట్ర అభివృద్ధికి కేంద్రం అన్ని విధాల సహకరిస్తుందన్నారు. రాష్ట్రంలో బిఆర్ఎస్ పార్టీకి బిజెపి మాత్రమే ప్రత్యామ్నాయం అన్నారు.తెలంగాణలో బిఆర్ఎస్ కాంగ్రెస్ రెండు పార్టీలు ఒకటేనని ఎద్దేవా చేశారు. తెలంగాణ రాష్ట్రం మరింత అభివృద్ధి పథంలో నడవాలంటే తెలంగాణలో కూడా బిజెపి ప్రభుత్వం రావాలన్నారు. రాష్ట్రంలో ఎన్నికలు ఎప్పుడు వచ్చినా భారతీయ జనతా పార్టీ మెజార్టీ సీట్లు గెలుచుకొని ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడం ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు పత్రి శ్రీనివాస్ యాదవ్, జిల్లా ఇంచార్జి అంజన్ కుమార్, సిరిసిల్ల జిల్లా ఇంఛార్జి మోహన్ రెడ్డి, ,రాష్ట్ర కార్యవర్గ సభ్యులు విద్యాసాగర్, అంబటి బాలేష్ గౌడ్, రామచంద్రా రెడ్డి, రాంచందర్ రావు, ఉపేందర్ రావు, నరేష్, మల్లేశం, శ్రీనివాస్ రెడ్డి, నరసింహారెడ్డి, పరశురాములు, గోనె మార్కండేయులు, వెంకటేశం, శ్రీనివాస్, శంకర్, శివకుమార్, నాగరాజు, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

రజకుల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వ చేయూత హర్షణీయం

రజక సంఘం మండల అధ్యక్షుడు రాచమల్ల ఎల్లేష్

నవతెలంగాణ-జగదేవ్పూర్ : రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో ముఖ్యమంత్రి కేసీఆర్ ఆధ్వర్యంలో రజకుల అభివృద్ధి, సంక్షేమం కోసం చేస్తున్న కృషి హర్షణీయమని జగదేవ్ పూర్ మండల రజక సంఘం అధ్యక్షుడు రాచమల్ల ఎల్లేష్ అన్నారు. శనివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ జీవో నంబర్ 102 ద్వారా ప్రభుత్వ రంగ సంస్థల బట్టలు, లాండ్రీ పనులను రజక సొసైటీలకు అప్పగించడం ఆర్థికంగా వెనుకబడిన సామాజిక కులాల అభివృద్ధికి సిఎం కేసీఆర్ చేస్తున్న కృషికి నిదర్శనమని కొనియాడారు. ఈ క్రమంలో కుల వృత్తిపై ఆధారపడిన రజకుల లాండ్రీ దుకాణాలకు 250 యూనిట్ల ఉచిత విద్యుత్ అందించడంతో పాటు రూ.లక్ష ఆర్థిక సహాయం మంజూరు చేయడం ప్రశంసనీయమని పేర్కొన్నారు. జీవో నంబర్ 102 విడుదల చేయించడానికి కృషి చేసిన మంత్రి గంగుల కమలాకర్, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, రాష్ట్ర రజక సంఘాల సమితి అధ్యక్షుడు అక్కరాజు శ్రీనివాస్ అధికారులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.